


# విభారే
తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY



ఆవుల పుల్లారెడ్డి సేవా సమితి
రి.నెం. 119/2015
ఆళ్ళగడ్డ, కర్నూలు జిల్లా
ఉచిత కళ్యాణ మండపం
స్వయం ఉపాధి శిక్షణ
ఉచిత రక్తదానము
ఉచిత న్యాయ సలహాలు
ఉచిత కంప్యూటర్ శిక్షణ
సంప్రదించవలసిన చిరునామా
అధ్యక్షులు ఆవుల విజయభాస్కర్ రెడ్డి అడ్వకేట్ B.A.LL.B
ఆళ్లగడ్డ
9440232308,9494498787



PUBLISHED FROM KURNOOL ఎడిటర్: ఆవుల విజయ భాస్కర రెడ్డి మంగళవారం 30 నవంబరు 2021 సంపుటి: 03 సంచిక: 98 పేజీలు: 4 వెల: రూ


## సాగు చట్టాల రద్దులోనూ అదే వైఖరి..

# చర్చ లేకుండానే ఆమోదం



న్యూఢిల్లీ: వివాదాస్పద సాగు చట్టాల రద్దు విషయంలో కూడా మోదీ ప్రభుత్వం తన పాత వైఖరినే అవలంబించింది. చట్టాలను రూపొందించినప్పుడు పార్లమెంట్‌లో ఎలాంటి చర్చ లేకుండానే ఇరు సభల ఆమోదం తీసుకున్నారు. తాజాగా ఆ చట్టాలను రద్దు చేస్తున్న సమయంలో కూడా ఇలాంటి పరిస్థితులే కనిపించాయి. శీతాకాల సమావేశాలు ప్రారంభమైన తొలిరోజునే చట్టాల రద్దును పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టారు. అయితే ఎలాంటి చర్చ చేయకుండానే ఓటింగ్ నిర్వహించి రద్దుకు ఇరు సభల ఆమోదం పొందారు.గత ఏడాది ఆగస్టులో సాగు చట్టాల బిల్లును లోక్‌సభలో, రాజ్యసభలో ప్రవేశ పెట్టినప్పుడు ఎలాంటి చర్చ లేకుండా ఓటింగ్ నిర్వహించి ప్రభుత్వం తన పట్టును నెగ్గించుకుంది. అయితే ఈ చట్టాలకు వ్యతిరేకంగా రైతులు నిర్విరామ ఆందోళన చేపట్టారు. 2020 నవంబర్ 26న దేశ రాజధాని ఢిల్లీ సరిహద్దులో చేపట్టిన ఆందోళన ఏడాది కాలంగా కొనసాగుతూనే ఉంది. మధ్యలో ప్రభుత్వంతో పలుమార్లు చర్చలు చేసినప్పటికీ ఉపయోగం లేకపోయింది. జనవరి 26న గణతంత్ర దినోత్సవం సందర్భంగా రైతులు చేపట్టిన ట్రాక్టర్ ర్యాలీ వివాదాస్పంగా మారింది. అయినప్పటికీ రైతులు ఏమాత్రం వెనకడుగు వేయకుండా ఆందోళన కొనసాగించారు. ఎట్టకేలకు ప్రభుత్వం దిగిరాక తప్పలేదు. మూడు సాగు చట్టాల్ని రద్దు చేస్తామని నవంబర్ 19న ప్రధానమంత్రి నరేంద్రమోదీ హామీ ఇచ్చారు. అంతే కాకుండా రైతులను అర్థం చేసుకోవడంలో విఫలమయ్యామని క్షమాపణలు చెప్పారు. అయితే సాగు చట్టాల రద్దుతో పాటు కనీస మద్దతు ధరపై చట్టం చేయాలని ఆందోళన చేస్తున్న రైతులు.. తమ డిమాండ్లు పూర్తి స్థాయిలో నెరవేరే వరకు ఆందోళన కొనసాగిస్తామని తేల్చి చెప్పారు.

## అయోమయంలో బిట్ కాయిన్ భవితవ్యం

క్రిప్టోకరెన్సీపై రకరకాల ఊహాగానాల నడుమ బిట్‌కాయిన్ భవితవ్యంపై పార్లమెంట్‌లో కీలక ప్రకటన చేశారు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్. బిట్‌కాయిన్‌ను కరెన్సీగా గుర్తించే ప్రతిపాదనేదీ కేంద్ర ప్రభుత్వం చేయలేదని ఆమె స్పష్టం చేశారు. 2021 సోమవారం మొదలైన విషయం తెలిసిందే. లోక్‌సభ కాసేపు వాయిదా తర్వాత తిరిగి ప్రారంభమైన తరుణంలో బిట్‌కాయిన్‌కు సంబంధించిన కీలక ప్రకటన చేశారు ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్. బిట్‌కాయిన్‌ను కరెన్సీగా గుర్తించే ప్రతిపాదన ఏదైనా ప్రభుత్వం చేస్తోందా? అన్న ప్రశ్నకు ఆమె బదులిస్తూ.. 'అలాంటిదేం లేదు సర్' అని సమాధానం ఇచ్చారు. బిట్‌కాయిన్‌ను కరెన్సీగా గుర్తించే ప్రతిపాదనేది తమ ప్రభుత్వం చేయట్లేదని, అలాగే బిట్‌కాయిన్ ట్రాన్‌జాక్షన్స్‌కు సంబంధించి వివరాలు సేకరించామన్న రిపోర్టులు నిజం కాదని ఆమె స్పష్టత ఇచ్చారు. దీంతో ప్రపంచంలో అతిపెద్ద క్రిప్టోకరెన్సీగా ఉన్న బిట్‌కాయిన్ విషయంలో కేంద్రం వైఖరి స్పష్టమైంది. ఇక ఆర్బీఐ డిజిటల్ కరెన్సీని తీసుకొస్తుందన్న కథనాలు నిజమేనని(వచ్చే ఏడాది నుంచి పైలట్ ప్రాజెక్ట్ మొదలు).. ఇందుకోసం 1934 చట్టానికి సవరణలు (డిజిటల్ కరెన్సీని ఫిజికల్ నోట్లతో సమానంగా గుర్తించాలనే!) ప్రతిపాదన ఆర్బీఐ, కేంద్రం ముందు ఉంచిదనే సమాచారం అందుతోంది. ఈ లెక్కన ప్రైవేట్ క్రిప్టోకరెన్సీ విషయంలో ప్రభుత్వం కఠిన నిర్ణయమే తీసుకొచ్చే అవకాశం ఉన్నట్లు సంకేతాలు పంపింది. ఇక 2008 నుంచి చెలామణిలోకి వచ్చిన బిట్‌కాయిన్.. డిజిటల్ కరెన్సీగా చెలామణి అవుతోంది. బిట్‌కాయిన్‌తో వస్తువుల కొనుగోలు, సేవలు, బ్యాంకులతో సంబంధం లేకుండా మనీ ఎక్స్ఛేంజ్ ఇతరత్రా లావాదేవీలు నిర్వహించు కునేందుకు వీలుంటోంది. నిర్మలా సీతారామన్ తాజా ప్రకటనతో బిట్‌కాయిన్ ఇన్వెస్టర్లకు నెత్తిన పిడుగుపడినట్లు అయ్యింది.



# ముఖ్యమంత్రితో కేంద్ర బృందం భేటీ

## వరద బాధిత ప్రాంతాల్లో పర్యటన వివరాలు తెలిపిన బృందం

అమరావతిభారీ వర్షాలు, వరద నష్టంపై కేంద్ర బృందంతో క్యాంప్ కార్యాలయంలో సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సమావేశమయ్యారు. కేంద్ర బృందం సభ్యులు కునాల్ సత్యార్థి, అభయ్ కుమార్, డాక్టర్ కే.మనోహరన్, శ్రీనివాసు బైరి, శివాని శర్మ, శ్రవణ్ కుమార్ సింగ్, అనిల్కుమార్ సింగ్లు హాజరు అయ్యారు. కునాల్ సత్యార్థిమాట్లాడుతూ మూ రోజులపాటు వరద బాధిత ప్రాంతాల్లో పర్యటించాం. వీలైనన్ని గ్రామాలను, వరద కారణంగా దెబ్బతిన్న ప్రాంతాలనూ పరిశీలించాం. కడప జిల్లాకు భారీ నష్టం వాటిల్లింది. ఆ గ్రామాలను కూడా పరిశీలించాం. పశువులు చనిపోయాయి, రోడ్లు, భవనాలు, ప్రాజెక్టులు.. ల్లాంటి మౌలిక సదుపాయాలు బాగా దెబ్బతిన్నాయి. అధికారులు మాకు మంచి సహకారాన్ని అందించారు. మా పర్యటనల్లో వివిధ రాజకీయ ప్రనిధులను, మీడియా



ప్రతినిధులను కలుసుకున్నాం. సంప్రదాయంగా వరదలు వచ్చే ప్రాంతం కాదు. అలాంటి ప్రాంతంలో ఊహించని రీతిలో వర్షాలు పడ్డాయి. కరువు ప్రాంతంలో అతి భారీవర్షాలు కురిశాయి. ఈ స్థాయిలో వరదను నియంత్రించగలిగే రిజర్వాయర్లు, డ్యాంలు కూడా ఈ ప్రాంతంలో లేవు. ఉన్న డ్యాంలు, రిజర్వాయర్లు కూడా ఈస్థాయి వరదలను ఊహించి నిర్మించినవి కావు. అన్నమయ్య ప్రాజెక్టు తెగిపోయిన చోట... నష్టం అపారంగా ఉంది. చిత్తూరులో జిల్లాలో కొంత భాగం, నెల్లూరులో కూడా వరదల ప్రభావం అధికంగా ఉంది. కడప జిల్లాలో మౌలికసదుపాయాల నిర్మాణాలు దారుణంగా దెబ్బతిన్నాయి, పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిందని అన్నారు. ముఖ్యమంత్రి జగన్ మాట్లాడుతూ ఇలాంటి విపత్తు హృదయవిదారకరం. నష్టం అంచనాలకోసం మీరు ఆయా ప్రాంతాల్లో పర్యటించినందుకు ధన్యవాదాలు. ఉదారంగా, మానవతా పరంగా స్పందించాలని కోరుతున్నా. పంపించిన నష్టం వివరాల్లో ఎలాంటి పెంపూ లేదు. నష్టం అంచనాల తయారీకి క్షేత్రస్థాయిలో మాకు సమర్థవంతమైన వ్యవస్థఉంది. ప్రతి గ్రామంలో ఆర్బీకే ఉంది, ప్రతి రైతు పంటకూడా ఇ?క్రాప్ అయ్యింది. సోషల్‌ఆడిట్కూడా చేయించాం. ఇ? క్రాప్కు సంబంధించి రశీదుకూడా రైతుకు ఇచ్చాం. నష్టంపోయిన పంటలకు సంబంధించి కచ్చితమైన, నిర్ధారించబడ్డ లెక్కలు ఉన్నాయి. క్షేత్రస్థాయిలో నష్టానికి సంబంధించి వాస్తవ వివరాలను మీకు అందించామని అన్నారు. కోవిడ్ నియంత్రణా చర్యలకోసం వినియోగించినందువల్ల ఎస్డీఆర్ఎఫ్ నిధులు నిండుకున్నాయని మా ఆర్థిక శాఖ కార్యదర్శి మీకు వివరించారు. పనులు చేయాలంటే నిధులు అవసరం, వెంటనే అడహాక్ ప్రాతిపదికన నిధులు ఇవ్వాలని కోరుతున్నాం. కేంద్ర బృందం చేసిన సూచనలనూ పరిగణలోకి తీసుకుంటామని అన్నారు.


# సీఎం జగన్‌ను కలిసిన కేంద్ర బృందం, పనితీరుపై ప్రశంసలు



తాడేపల్లి: రాష్ట్రంలో వరద నష్టం అంచనాకు వచ్చిన కేంద్ర బృందంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భేటీ అయ్యారు. వరద బాధిత ప్రాంతాల్లో పర్యటన వివరాలు తెలిపిన కేంద్ర బృందం.. రాష్ట్ర ప్రభుత్వ చర్యలను ప్రశంసించింది. వరద ప్రభావిత ప్రాంతాల్లో తాము పరిశీలించిన అంశాలను సీఎం జగన్‌కు కేంద్ర బృందం వివరించింది. కేంద్ర బృందం తరఫున కేంద్ర హోంమంత్రిత్వశాఖ ఎన్ఎండీఏ సలహాదారు కునాల్ సత్యార్థి వివరాలు అందించారు.ఈ సందర్భంగా కునాల్ సత్యార్థి మాట్లాడుతూ.. 3 రోజులపాటు వరద బాధిత ప్రాంతాల్లో పర్యటించినట్లు తెలిపారు. వీలైనన్ని గ్రామాలను, వరద కారణంగా దెబ్బతిన్న ప్రాంతాలనూ పరిశీలించామని, కడప జిల్లాకు భారీ నష్టం వాటిల్లిందని తెలిపారు. ఆ గ్రామాలను కూడా పరిశీలించామని, పశువులు చనిపోవడం, రోడ్లు, భవనాలు, ప్రాజెక్టులు.. ల్లాంటి మౌలిక సదుపాయాలు బాగా దెబ్బతిన్నాయన్నారు. సీఎం జగన్ నాయకత్వంతో ఈ రాష్ట్ర ప్రభుత్వం పనితీరు ప్రశంసనీయమని ఆయన కొనియాడారు. అంకిత భావంతో పనిచేసే అధికారులు ఉన్నారని, వీరంతా తమకు మంచి సహకారాన్ని అందించారన్నారు.ఇంకా ఆయనమాట్లాడుతూ.. 'యువకులు, డైనమిక్‌గా పనిచేసే అధికారులు ఉన్నారు. విపత్తు సమయంలో అద్భుతంగా పనిచేశారు. మా పర్యటనల్లో వివిధ రాజకీయ ప్రనిధులను, మీడియా ప్రతినిధులను కలుసుకున్నాం. ప్రతి ఒక్కరూ కూడా వరదల్లో రాష్ట్ర ప్రభుత్వం పనితీరును ప్రశంసించారు. సంప్రదాయంగా వరదలు వచ్చే ప్రాంతం కాదు. అలాంటి ప్రాంతంలో ఊహించని రీతిలో వర్షాలు పడ్డాయి. ఇంత స్థాయిలో వరదను తీసుకెళ్లగలిగే పరిస్థితి అక్కడున్న నదులు,

వాగులు, వంకలకు లేదు. కరువు ప్రాంతంలో అతి భారీవర్షాలు కురిశాయి. ఈ స్థాయిలో వరదను నియంత్రించగలిగే రిజర్వాయర్లు, డ్యాంలు కూడా ఈ ప్రాంతంలో లేవు. ఉన్న డ్యాంలు, రిజర్వాయర్లు కూడా ఈస్థాయి వరదలను ఊహించి నిర్మించినవి కావు. ఇలాంటి పరిస్థితులు ప్రపంచవ్యాప్తంగా తలెత్తున్నాయి.కరువు ప్రాంతాల్లో కుంభవృష్టి, నిరంతరం మంచి వర్షాలు కురిసేచోట కరువు లాంటి పరిస్థితులు నెలకొంటున్నాయి. తీరందాటిన తర్వాత అల్పపీడనం వెంటనే తొలగిపోలేదు, అది చాలా రోజులు కొనసాగింది. కడప జిల్లాలో వరదల వల్ల నష్టం అధికంగా ఉంది. అన్నమయ్య ప్రాజెక్టు తెగిపోయిన చోట నష్టం అపారంగా ఉంది. చిత్తూరులో జిల్లాలో కొంత భాగం, నెల్లూరులో కూడా వరదల ప్రభావం అధికంగా ఉంది. కడప జిల్లాలో మౌలికసదుపాయాల నిర్మాణాలు దారుణంగా దెబ్బతిన్నాయి, పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. పంట చేతికందుతున్న సమయంలో నీట పాలైంది.శనగ పంట కూడా తీవ్రంగా దెబ్బతింది. వాటర్ స్కీములు కూడా దెబ్బతిన్నాయి.

# డాలర్ శేషాద్రి మృతి...



తిరుమల తిరుమల శ్రీవారి ఆలయ ఓఎస్డి డాలర్ శేషాద్రి కన్నుమూసారు. విశాఖ నగరంలో కార్తీక దీపోత్సవం కార్యక్రమంలో పాల్గొనడానికి వచ్చిన ఆయన తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందారు. ఆదివారం రాత్రి 8 గంటలకు కల్యాణ రథంలో విశాఖలోని ఎంవిపి కాలనీ కి చేరుకున్న ఆయన టిటిడి కళ్యాణ మండపం లో జరిగిన స్వామివారి పవళింపు సేవలో పాల్గొన్నారు. అనంతరం టిటిడి ఉద్యోగుల తో కాసేపు మాట్లాడి కళ్యాణ మండపం లోనే బసచేశారు. ఈ క్రమంలో తెల్లవారుజామున నాలుగు గంటలకు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వెంటనే టీటీడీ అధికారులు ఆయనను రామ్ నగర్ లోని అపోలో ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో తుది శ్వాస విడిచారు. శేషాద్రి భౌతికాయం తిరుపతి కి తరలించి తిరుపతిలోని గోవిందామంలో అంతిమ సంస్కారాలు నిర్వహించనున్నారు. 1978 నుంచి శ్రీవారి సేవలో డాలర్ శేషాద్రి తరిస్తున్నారు. 2007లోనే రిటైర్ అయినప్పటికీ ఆయన సేవలను గుర్తించిన తిరుమల తిరుపతి దేవస్థానం ఓఎస్డీగా కొనసాగిస్తోంది. డాలర్ శేషాద్రి మరణం టీటీడీకి తీరని నష్టమని, ఆయన లేని లోటు భర్తీ కాదని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. స్వామివారి సేవలో కన్నుమూసినా పరవాలేదని శేషాద్రి అనేవారని పలువురు గుర్తు చేసుకున్నారు. శ్రీవారి సేవలో తరించడమే తన జీవిత లక్ష్యమని శేషాద్రి చెప్పేవారని వివరించారు. 2013లో శేషాద్రి కిడ్నీ మార్పిడి జరిగింది. తిరుమల శ్రీవారి ఆలయ ఓఎస్డి డాలర్ శేషాద్రి మరణంతో టిటిడి వర్గాలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. స్వామి వారికి నిత్యం జరిగే కైంకర్యాలు, ఆలయ సంప్రదాయాలపై ఆయనకు మంచి పట్టు ఉంది. మరోవైపు ప్రముఖులు ఎవరైనా తిరుమల వస్తే డాలర్ శేషాద్రి కచ్చితంగా అక్కడ ఉండే వారు. 1978 నుంచి టీటీడీ వ్యవహారాల్లో ఉండటంతో ఎంతోమంది రాష్ట్రపతులు, ప్రధానులు, గవర్నర్లు, ముఖ్యమంత్రులు, పారిశ్రామికవేత్తలు శ్రీవారి దర్శనానికి వస్తే ఆయన దగ్గరుండి పర్యవేక్షించేవారు. ఒకప్పటి రాష్ట్రపతి జ్ఞానీ జైల్ సింగ్, ప్రధాని పీవీ నరసింహారావు, వాజ్పేయ్, మన్మోహన్ సింగ్, నరేంద్ర మోడీ, తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు కేసీఆర్, జగన్, చంద్రబాబు నాయుడు, వైయస్ రాజశేఖర్ రెడ్డి, కిరణ్ కుమార్ రెడ్డి, ఇతర రాష్ట్రాల గవర్నర్లు, ముఖ్యమంత్రులు తిరుమల శ్రీవారి దర్శనానికి వచ్చినప్పుడు వారితో డాలర్ శేషాద్రి అక్కడ కనిపించే వారు. తిరుమల శ్రీవారి ఆలయ ఓఎస్డి డాలర్ శేషాద్రి మరణంతో తిరుమల తిరుపతి దేవస్థానం వర్గాలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి.

## ఏపీలో నాలుగు జిల్లాలకు

# ఆరెంజ్ అలర్ట్..

అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు, వైఎస్సార్ జిల్లాలకు భారత వాతావరణ శాఖ (ఐఎండీ) ఆరెంజ్ అలర్ట్ చేసింది. నాలుగు జిల్లాలో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. దక్షిణ అండమాన్ సముద్రంలో 30న మరొక అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉన్నట్లు పేర్కొంది. తొలుత ఇది 29వ తేదీనే ఏర్పడుతుందని అంచనా. కానీ ప్రస్తుతం బ్యాంకాక్ సమీపంలో ఉండడంతో అండమాన్ తీరానికి వచ్చేందుకు సమయం పడుతుందని వాతావరణ శాఖ తెలిపింది.



దీని ప్రభావం ఏపీలో వచ్చే నెల 3 నుంచి 5 వరకు ఉత్తరాంధ్రలో కొంతమేర ఉండే అవకాశం ఉందని తెలిపారు. తమిళనాడుపై ఈశాన్య రుతుపవనాల ప్రభావం తీవ్రంగా కనిపిస్తోంది. ఈ సీజన్‌లో మదురై, విరుదునగర్ జిల్లాల మినహా మిగిలిన అన్ని జిల్లాల్లోనూ అత్యధిక వర్షపాతాలు నమోదయ్యాయి. తాజాగా మళ్లీ వానలు పడుతుండటంతో వరదముప్పు ఉందని విపత్తు నిర్వహణ సంస్థ హెచ్చరికలు జారీ చేసింది. మరోవైపు పలు జిల్లాల్లో చెక్‌డ్యాంల నుంచి వరద ముప్పు ఉండొచ్చని హెచ్చరిస్తున్నారు. పరిసర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రాష్ట్రంలోని 14 జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేశారు.

# ముంపు ప్రాంతాలకు వెళితే సహాయక కార్యక్రమాలకు ఆటంకమని జగన్ చెప్పడం చేతగానితనమే: చంద్రబాబు

అమరావతి: వరదలతో చనిపోయిన వారివి ఖచ్చితంగా ప్రభుత్వ హత్యలేనని టీడీపీ అధినేత చంద్రబాబు అన్నారు. సోమవారం ఆయన పార్టీ ముఖ్యనేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముంపు ప్రాంతాలకు వెళితే సహాయక కార్యక్రమాలకు ఆటంకమని సీఎం జగన్ రెడ్డి వ్యాఖ్యానించడం చేతగానితనమేనని విమర్శించారు. ఫ్లడ్ మేనేజ్‌మెంట్‌లో ఘోరంగా విఫలమయ్యారని, దీనిపై న్యాయ విచారణ జరగాలన్నారు. బాధితులకు ఇంతవరకు నష్ట పరిహారం అందలేదన్నారు. ఆయా పంటలకు టీడీపీ హయాంలో చెల్లించిన ఇన్ పుట్ సబ్సీడీని తగ్గించారని విమర్శించారు. డిజాస్టర్ మేనేజ్ మెంట్ నిధులు రూ.1,100 కోట్లు బాధితులకు ఇవ్వకుండా దారి మళ్లించారన్నారు. వరి వేయవద్దని చెబుతూ రైతులను వ్యవసాయానికి దూరం చేస్తున్నారని, పంట బీమా ప్రీమియం కట్టకుండా జగన్ రెడ్డి మోసం చేస్తున్నారన్నారు. రాష్ట్ర వాటా చెల్లించకపోవడంతో కేంద్ర సాయం కూడా అందని పరిస్థితి నెలకొందన్నారు. బీమా కట్టకపోవడంతో రైతులకు పరిహారం అందడంలేదన్నారు. 2020లోనూ పంట బీమా ప్రీమియం కట్టకుండా అసెంబ్లీలో కట్టామని అబద్ధం చెప్పారన్నారు. ఓటీఎస్ పథకం పేరుతో రూ.14,261 కోట్లు పేదల నుంచి వసూలు చేయడాన్ని విరమించుకోవాలని



డిమాండ్ చేశారు. ప్రభుత్వం కేటాయించిన ఇళ్లకు ఏ ఒక్కరు కూడా రూపాయి కట్టాల్సిన అవసరం లేదన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఉచితంగా రిజిస్ట్రేషన్లు చేయిస్తామన్నారు. అన్ని గ్రామాలు, పట్టణాల్లో గౌరవ సభలు నిర్వహించి.. మహిళల పట్ల వైసీపీ వైఖరితో పాటు క్షేత్రస్థాయి సమస్యలు, ప్రజా సమస్యలు చర్చిస్తామన్నారు.

# సంపాదకీయం

మంగళవారం 30 నవంబరు 2021

## క్రిప్టో కరెన్సీపై ఆచితూచి అడుగులు

ప్రపంచ వ్యాప్తంగా క్రిప్టో కరెన్సీ మాట బాగా వినిపిస్తోంది. అనేక రంగాల్లోకి క్రిప్టో కరెన్సీ ప్రవేశించింది. కార్ల కొనుగోలు నుంచి షాపింగ్ వరకు క్రిప్టో కరెన్సీని వినియోగిస్తున్నారు. అయితే, మనదేశంలో క్రిప్టో కరెన్సీకి ఎలాంటి అనుమతులు ఇవ్వలేదు. ఇప్పటికే భారత ప్రభుత్వం ప్రైవేట్ ఎక్స్ఛేంజీలపై నిషేదం విధించింది. క్రిప్టో కరెన్సీ ఎవరి నియంత్రణలో ఉండవు కాబట్టి వాటికి అడ్డుకట్ట వేయడం కష్టంతో కూడుకున్నది. ఇక క్రిప్టో కరెన్సీపై భారత ప్రభుత్వం ఓ బిల్లును తీసుకురాబోతున్నది. శీతాకాల సమావేశాల్లో ఈ బిల్లును ప్రవేశపెట్టబోతున్నారు. ఈ బిల్లు ప్రవేశపెట్టే ముందే భారత్‌లోకి అంతర్జాతీయ క్రిప్టో కరెన్సీ ఎక్స్ఛేంజ్ ప్రవేశించింది. కాయిన్ స్టోర్ పేరుతో బెంగళూరు, ముంబై, ఢిల్లీలో కార్యాలయాలను ఏర్పాటు చేసింది. కాయిన్ స్టో మొదట వంద మంది ఉద్యోగులను తీసుకోబుతున్నట్టు తెలియజేసింది. రెండు కోట్ల డాలర్లను పబ్లిసిటీ కోసం వినియోగించబోతున్నట్టు కాయిన్ స్టోర్ ప్రకటించింది. క్రిప్టో కరెన్సీ బిజినెస్‌కు సంబంధించి భారత ప్రభుత్వం సానుకూల విధానాలను తీసుకొస్తుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేసింది సింగపూర్‌కు చెందిన ఈ కాయిన్ స్టోర్ ఎక్స్ఛేంజ్. క్రిప్టో కరెన్సీలను అనుమతించాలా లేదా అనే అంశంపై అనేక ప్రపంచ దేశాలు తీవ్ర సందిగ్ధంలో ఉన్నాయి. ఇంతకాలం బ్యాంకులు, బీమాలు, భూములు, బంగారమంటూ మాత్రమే పెట్టుబడులుండేవి. వీటి సరసన క్రిప్టోలు చేరాయి. భారత్‌లోనూ వర్చువల్ కరెన్సీలకు అధికారికంగా అనుమతి లేకపోయినప్పటికీ.. బిట్‌కాయిన్, ఇతర కరెన్సీలతో కనివిని ఎరుగని రాబడి వస్తుందనే అంచనాల్లో లక్షలాది మంది ఈ కరెన్సీని కొనుగోలు చేస్తున్నారు. కంటికి కనబడని ఈ కరెన్సీలో 2020లో 92.3 కోట్ల డాలర్లున్న భారతీయుల పెట్టుబడులు 2021లో 660 కోట్ల డాలర్లకు చేరడంతో బ్రిటన్‌ను సైతం దాటేశాయి. ఈ పెట్టుబడులు ఆర్థిక వ్యవస్థకు ప్రమాదకరమని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఓ వైపు హెచ్చరిస్తుండగనే.. ప్రభుత్వ విధాన నిర్ణయ లోపంతో రోజు రోజుకు ఈ కరెన్సీలు భారతీయులు పెట్టుబడులు పెంచేసుకుంటున్నారు. ప్రస్తుతం ప్రపంచంలో 3 లక్షల కోట్ల డాలర్ల విలువైన క్రిప్టో కరెన్సీలు చలామణీలో ఉన్నాయి. అత్యధికంగా భారత్‌లోనే 10 కోట్లకు పైగా కొనుగోళ్లు జరిగాయని పలు రిపోర్ట్‌ల అంచనాలు ఆశ్చర్యకరం. క్రిప్టోకరెన్సీ అంటే ఎలక్ట్రానిక్ చెల్లింపు నెట్‌వర్క్. వీటికి భౌతిక రూపం ఉండదు. దీనికి వాడే 'బ్లాక్‌చెయిన్' విధానంలో రికార్డులను తారుమారు చేయడం అసాధ్యం. 2009లో బిట్‌కాయిన్ పేరుతో క్రిప్టో కరెన్సీ విధానం మొదలైతే, ఇప్పుడు ఎథీరియమ్, రిపుల్, డోజ్‌కాయిన్ తదితర ఇలా 10 వేల క్రిప్టో కరెన్సీలున్నాయని అంచనా. ప్రపంచ దేశాల హద్దులను చెరిపేస్తున్న ఈ కరెన్సీలు సాధారణ బ్యాంకుల్లో లాగా కాకుండా ఇంటర్నెట్‌తో వికేంద్రీకతంగా లావాదేవీలు సాగుతాయి. సెప్టెంబర్‌లో ఎల్‌సాల్వడార్‌లా క్రిప్టోను కరెన్సీగా అంగీకరించింది. చైనా మాత్రం నిషేధిస్తూ కఠిన నిర్ణయం తీసుకుంది. భారత్‌లో 2013 నుంచి దీనిపై చర్చ సాగుతూనే ఉంది. ఇక్కడి కోర్టులో 2017లో ప్రజాప్రయోజన వ్యాజ్యాలు దాఖలు కావడం, 2018లో క్రిప్టోపై ఆర్‌బిఐ నిషేధం విధించింది. తిరిగి 2020 మార్చిలో సుప్రీంకోర్టు ఆ నిషేధాన్ని ఎత్తివేసింది. క్రిప్టో పెట్టుబడులతో డబ్బు దేశం దాటే ప్రమాదం ఉంది. దేశ ఉత్పత్తి, పరపతికి సంబంధం లేకుండా చెలామణి అవుతుంది. ఈ కరెన్సీల వాడకంతో యూజర్ ఛార్జీలు ఉండవు. ప్రపంచంలో ఎక్కడికైనా ఇప్పుడున్న చెల్లింపు వ్యవస్థల కన్నా చౌకగా, వేగంగా చెల్లింపులు చేయవచ్చు. ప్రపంచమంతటా విస్తరించిన ప్రభుత్వేతర ఆన్‌లైన్ కమ్యూనిటీలు ఈ కరెన్సీలను సృష్టించడంతో అవే లావాదేవీలకు కేంద్రంగా ఉంటాయి. దీంతో మదుపరులెవరో ఎవరికీ తెలియదు. డ్రగ్స్, అంతర్జాతీయ హవాలాకు అత్యంత అనుకూలంగా మారుతుంది. తీవ్రవాదులు దీన్ని ఉపయోగించుకోవడం ద్వారా ముప్పు వాటిల్లే ప్రమాదం లేకపోలేదు. చెల్లింపు వ్యవస్థల్లో ప్రభుత్వ పాత్ర లేకుండా చేయాలన్న క్రిప్టో కరెన్సీల అసలు ఉద్దేశ్యం. ఇందులోని పెట్టుబడులకు మోస పోతే ఏ చట్టం కూడా సాయపడదు. దేశ భద్రత, ఆర్థిక సుస్థిరత, ప్రజల పెట్టుబడులకు భద్రత కల్పించాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వం, ఆర్‌బిఐలపై ఉందని నిపుణులు సూచిస్తున్నారు. క్రిప్టో సమస్యల్ని అధిగమించాలంటే, సెంట్రల్ బ్యాంక్‌లే డిజిటల్ కరెన్సీలను జారీ చేయాలని సూచిస్తున్నారు. క్రిప్టో కరెన్సీ విదివిధానాలపై కేంద్ర ప్రభుత్వం త్వరలోనే చట్టం తీసుకురావడానికి ఇటీవల ప్రధాన మంత్రి స్థాయిలో పలు భేటీలు జరిగాయి. పెట్టుబడులు పెట్టే వారి హక్కులకు రక్షణ ఉండేలా చట్టంలో తప్పనిసరిగా చర్యలు ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు.

## భారీగా పెరగనున్న అన్నవరం సేవలు




కాకినాడ, నవంబర్ 29, (న్యూస్ పల్స్)ఏటా వందకోట్ల ఆదాయం వచ్చే ఆలయం. ఎవరు గుర్తించరని అనుకున్నారో.. ఇంతకంటే మంచి తరుణం రాదని భావించారో.. చేతివాటం ప్రదర్శిస్తున్నారట. కమీషన్లు పెంచి ముడుపులు దండుకున్నారట. నిధులు దారి మళ్లించడంలోనూ వారి తర్వాతేనని ఆరోపణలు గుప్పుమంటున్నాయి. భక్తులు కోరిన కోరికలు తీర్చే కొంగు బంగారం అన్నవరం సత్యనారాయణ స్వామి. నిత్యం భక్తులతో రద్దీగా ఉండే ఈ ఆలయ పాలకమండలి ఛైర్మన్ రోహిత్. ఈవో త్రినాథ్. దేవుడికి వచ్చే ప్రతి రూపాయిని సద్వినియోగం చేసి అభివృద్ధి బాటలో నడిపించే బాధ్యత వీరిదే. కానీ.. నిధులను వేరే సంస్థలకు మళ్లించారనే ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. ఏటా స్వామివారికి 100 కోట్లకు పైబడి ఆదాయం వస్తుంది. ఆ మేరకు రత్నగిరిపై భక్తులకు సరైన సదుపాయాలు లేవనే విమర్శలు ఎప్పటి నుంచో ఉన్నాయి. దాతలు ఇచ్చే విరాళాలతో కాటేజీలు నిర్మించారు తప్ప.. ఆలయ నిధులతో ఒక్కటీ చేపట్టలేదు. దాతల సహకారంతో నిర్మాణాలు పూర్తి చేసుకునే వాటిలో చేతివాటం ప్రదర్శిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇటీవల జరిగిన దేవస్థానం పాలకమండలి సమావేశంలో 30 శాతంగా ఉన్న వ్రత పురోహితుల కమీషన్‌ను 40 శాతానికి పెంచారు. పైకి కమిషన్ పెంపు సాధారణంగానే కనిపించినా.. ఈ నిర్ణయం తీసుకోవడానికి భారీగా ముడుపులు చేతులు మారినట్టు చెబుతున్నారు. కరోనా వల్ల కొద్దిరోజులు ఆలయం మూసివేశారు. తిరిగి తెరిచినా గతంలోలా భక్తుల రద్దీ లేదు. ఆదాయం తగ్గింది. ఈ సమయంలోనూ ఆలయానికి చెందిన 4 కోట్ల 80 లక్షలు రిలీఫ్ ఫండ్‌కు మళ్లించారట. దీనిపై రగడ జరుగుతోంది. గత ఏడాది కరోనా వల్ల 180 రోజులపాటు ఆలయం మూసివేశారు. సిబ్బందికి 8 నెలలపాటు సగం జీతాలే ఇచ్చారు. కరోనా సెకండ్ వేవ్ తర్వాత కూడా అదే పరిస్థితి. మే 8న మూతపడ్డ ఆలయం జూన్ 11న తెరుచుకున్నా.. భక్తుల తాకిడి లేదు. ఆదాయం తగ్గుముఖం పట్టింది. ఇచ్చేది సగం జీతమే అయినా అది కూడా రెండో వారానికి కానీ అందడం లేదట. ఇలాంటి ప్రతికూల సమయంలో ఆలయ ఉద్యోగులను ఆదుకోకుండా రిలీఫ్ ఫండ్‌కు 4 కోట్ల 80 లక్షలు మళ్లించడంపై ఉద్యోగులు గగ్గోలు పెడుతున్నారు. ఏప్రిల్ 27న దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఆలయానికి వచ్చి అకౌంట్స్ పరిశీలించిన తర్వాత ఏం జరిగిందా అని మరికొందరు ఆరా తీస్తున్నారట. రెండేళ్ల క్రితం ఈవోగా వచ్చిన త్రినాథ్.. సొంతంగా ఏ నిర్ణయం తీసుకోలేకపోవడం కూడా ఇక్కడి సమస్యలకు ఒక కారణంగా ఉద్యోగవర్గాలు చెవులు కొరుక్కుంటున్నాయి. పాలకమండలి సైతం పూర్తిస్థాయిలో ఫోకస్ పెట్టడం లేదట. గత ఏడాది ఫిబ్రవరిలో ఏర్పాటైన పాలకమండలి కొండకు చుట్టపు చూపుగా వస్తోందట. ఛైర్మన్ రోహిత్ ఆలయంపై పట్టు సాధించలేదట. కొందరు సిబ్బంది ఏం చెబితే అదే ఆయన చేస్తున్నారట. దాంతో పోస్టు కాపాడుకోవాలని అనుకుంటున్నారో ఏమో.. కీలక నిర్ణయాల్లో ఛైర్మన్ భాగస్వామ్యం కావడం లేదనే విమర్శలు వస్తున్నాయి. ప్రస్తుతం సరైన పర్యవేక్షణ లేకపోవడంతో కొందరు ఆడింది ఆట.. పాడింది పాటగా ఉందట. మరి.. భక్తుల కోర్కెలు తీర్చే స్వామివారు.. తమ సేవలో ఉన్న ఉద్యోగులకు ఎప్పుడు ఊరట నిస్తారో.. అక్రమాలకు ఎలా చెక్ పెడతారో చూడాలి.

## అలంకార ప్రాయంగా మారిన పదవులు

విశాఖపట్టణం, నవంబర్ 29, (న్యూస్ పల్స్)రాజకీయాల్లో నాయకులు ప్రధానంగా ఈ కిరీటాలనే కోరుకోవడం సహజం. చేతిలో పదవి ఉంటే పట్టుకుని ఊరేగవచ్చు... ఇది నేటి రాజకీయాల్లో వెలుగొందుతున్న వాస్తవం. ఇలాంటి రాజకీయాలను దృష్టిలో పెట్టుకునే ఎరిక్ ఫ్రామ్ అనే సామాజిక శాస్త్రవేత్త... అధికార వాంఛ బలం నుంచి కాక.. బలహీనత నుంచి ఉద్భవిస్తుంది..." అని వ్యాఖ్యానిస్తారు. రాష్ట్రంలో అధికారంలో కొనసాగుతున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గడచిన రెండున్నరేళ్లలో పలు నామినేటెడ్ పదవులను భర్తీ చేయడంతో ఆ పార్టీలో దాదాపు చోటా, మోటా నేతలందరికీ పదవులు లభించినట్టే అయింది. తమ సామాజిక తరగతికి అధిక ప్రాధాన్యత ఇచ్చినట్లు అన్ని సామాజిక తరగతుల వారూ ప్రకటించారు. తాజాగా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ పదవులు కూడా వైసిపి నేతలు చెన్నుబోయిన వంశీకృష్ణ శ్రీనివాస్‌యాదవ్, వరుదు కల్యాణికి లభించిన సంగతి తెలిసిందే. ఎమ్మెల్సీల సంగతి సరేసరి... మిగతా పదవులతోనే రెండో తరగతి నాయకులు ఎలా పబ్బం గడుపుకోవాలో అర్థం కాని స్థితి వారిలో నెలకొంది. రాష్ట్ర వ్యాప్తంగా 56 కార్పొరేషన్లకు చైర్మన్లు, డైరెక్టర్ల పదవులు గతంలోనే ప్రభుత్వం ప్రకటించింది. విశాఖపట్నానికి చెందిన 11 మంది నేతలకు కార్పొరేషన్ చైర్మన్ పదవులు లభించగా, పలువురికి డైరెక్టర్ల పదవులు వచ్చాయి. స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపొందిన వారిలో 80శాతం వైసిపి పార్టీకి చెందిన వారే. కానీ ఈ పదవులు అలంకార ప్రాయం మినహా జనానికి ఏమీ ఒరగదన్న సంకేతాలు వెల్లడవుతున్నాయి. పదవులు వచ్చిన వీరంతా ఏం చేయాలి? ఏం చేస్తున్నారు? ఏమైనా చేద్దామంటే వీరికి గల అధికారాలు? విధులు? ఏమైనా ప్రభుత్వం వైపు నుంచి నిర్దేశించబడ్డాయా? అంటే శూన్యం అనే చెప్పాలి. కార్పొరేషన్ డైరెక్టర్లు, చైర్మన్లును దిగువ శ్రేణి అధికార పార్టీ నాయకులు సన్మానించడం, లేదంటే వీరంతా వెళ్లి ఎంపీలనో.. మంత్రులనో... ముఖ్యమంత్రినో కలవడం... దానికి మర్యాదపూర్వకంగా కలిసినట్లు ప్రచారం చేసుకోవడం మినహా ఫలానా కార్పొరేషన్ తరపున ఆ ప్రజలకు జరిగిన మేలు ఏదైనా ఉందంటే అది ఒట్టిమాటే. స్థానిక సంస్థలకు ఎన్నికైన ప్రజాప్రతినిధుల పరిస్థితి కూడా అలాగే ఉంది. జివిఎంసి పరిధిలోని వార్డుల్లో అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు ఇవ్వడం లేదు. దీనిపై ప్రతిపక్ష కార్పొరేటర్లు గతంలో ప్రశ్నించిన సందర్భాలు కూడా ఉన్నాయి. తాజాగా రాష్ట్ర వ్యాప్తంగా, విశాఖ జిల్లాలోనూ సర్పంచ్‌లు చేస్తున్న ఆందోళన గురించి తెలిసిందే. పంచాయతీల అభివృద్ధికి చట్ట ప్రకారం కేంద్రం నుంచి విడుదలైన 14, 15 ఆర్థిక సంఘం నిధులను రాష్ట్ర ప్రభుత్వం దారిమళ్లించింది. దీంతో అన్ని పంచాయతీల ఖాతాల్లోనూ జీరో బ్యాలెన్స్. సర్పంచ్‌లు ఏ చిన్న పని చేయలేని పరిస్థితిని వైసిపి ప్రభుత్వం తీసుకొచ్చింది. జివిఎంసి కార్పొరేటర్లు విషయానికొస్తే కొంతమంది అత్యంత ఖరీదైన వాహనాల్లో తిరగడం మినహాయిస్తే నగర పరిధిలో పారిశుధ్య సమస్యల పరిష్కారానికి కూడా కృషి చేయడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. మరో వైపు వైసిపి ప్రభుత్వం వేసే భారాలకు వీరంతా ఆమోదముద్ర వేస్తున్నారు. మరోవైపు జగన్ ప్రభుత్వం వెనక నుంచి ప్రజలపై ఆర్థిక భారాలను మోపుతుంది. చెత్త సేకరణకు రూ.125లు నెలనెలా వసూలు, ఆస్తి పన్ను పెంపు వల్ల జనం నెత్తిన భారాల మోత మోగుతుంది. ఇదీగాక తాజాగా ప్రభుత్వం డి పట్టా ఇల్లు, స్థలాలకూ రిజిస్ట్రేషన్ పేర రూ.20వేల నుంచి రూ.40వేలు వసూలు చేసి ఖజానా నింపుకునేందుకు ప్రభుత్వం ప్లాన్ చేసింది. ఇప్పటికే మద్యం, ఇసుక ధరలను రాష్ట్ర వ్యాప్తంగా భారీగా ప్రభుత్వం పెంచడంతో సామాన్య, మధ్యతరగతి జనం విలవిల్లాడుతున్నారు. సంక్షేమం దారిలో ప్రయాణం చేస్తూ చేదు గుళికలనూ ప్రభుత్వం తినిపిస్తుందంటూ పలువురు ఆ పార్టీకి చెందిన నాయకులే వ్యాఖ్యానిస్తున్నారు.

## ఉండవల్లి, ముద్రగడ...ప్లస్సా, మైనస్సా..



రాజమండ్రి, నవంబర్ 29, (న్యూస్ పల్స్)ఇద్దరూ ప్రభావితం చేయగల నేతలే. ఇద్దరికీ ప్రత్యక్ష రాజకీయాల్లో అనుభవం ఉంది. ప్రజాసమస్యలు వారికి తెలిసినంతగా ఎవరికీ తెలియదు. క్షేత్రస్థాయిలో వారికి ప్రజల మూడ్ తెలుసు. అలాంటి నేతలు ఇప్పుడు చెరొక వైపుగా నిలవడం ఏపీ రాజకీయా?ల్లో చర్చగా మారింది. వారే మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్. కాపు రిజర్వేషన్ పోరాట ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం. ఇద్దరూ తూర్పు గోదావరి జిల్లాకు చెందిన నేతలే కావడం గమనార్హం. ముందుగా ఉండవల్లి అరుణ్ కుమార్ గురించి చెప్పుకుందాం. ఆయన బ్రాహ్మణ సామాజికవర్గానికి చెందిన వారు. పెద్దగా కుల ఓట్లను ఆకర్షించే శక్తి లేదు. అలాగని ప్రజలను ప్రభావం చేయలేరని కాదు. ఉండవల్లి మాటలంటే అనేకమందికి గురి. ప్రధానంగా మేధావులు, తటస్థులలో ఆయన ఉన్నది ఉన్నట్లు మాట్లాడతారన్న పేరుంది. ప్రజల మూడ్ తెలుసుకునే మాట్లాడతారని కూడా అంటారు. ప్రతి అంశంపై పూర్తి స్థాయిలో అధ్యయనం చేసిన తర్వాతనే ఏదైనా విమర్శలు చేస్తారు. ఆయనకు రాష్ట్ర వ్యాప్తంగా అభిమానులుండటంతో వారి చేత ఫీడ్ బ్యాక్ తెప్పించుకుని మరీ చెబుతారు. కొద్ది కాలంగా ఉండవల్లి అరుణ్ కుమార్ జగన్ ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, పోలవరం ప్రాజెక్టు వంటి అంశాలపై ఆయన జగన్ ప్రభుత్వాన్ని ఎప్పటికప్పుడు ఇరుకున పెడుతూ ఉన్నారు. ఒక రకంగా పరోక్షంగా ఆయన చంద్రబాబుకు సహకారం అందిస్తున్నట్లే లెక్క. నేరుగా మద్దతివ్వకపోయినా చంద్రబాబు పట్ల ప్రజల్లో సానుకూలత నెలకొనేలా ఆయన కామెంట్స్ ఉన్నాయి. కాపుల్లో ఇక కాపు రిజర్వేషన్ పోరాట సమితి ముద్రగడ పద్మనాభం పూర్తిగా చంద్రబాబుకు యాంటీగా కనపడుతున్నారు. ఈయన కాపు సామాజికవర్గంలో బలమైన నేత. ఆయన ఆ కులాన్ని ప్రభావం చేయగలరు. కేవలం కులం నేతగానే ఆయన గుర్తించబడుతున్నారు. ఆయన చంద్రబాబును నిత్యం ఇబ్బందుల్లోకి నెట్టేందుకే ప్రయత్నిస్తారు. జగన్ కు నేరుగా మద్దతివ్వకపోయినా పరోక్షంగా ఆయనకు సహకరిం అందిస్తున్నట్లే లెక్క. చంద్రబాబు టార్గెట్.... కాపు రిజర్వేషన్ ఉద్యమం నుంచి తప్పుకున్న ముద్రగడ పద్మనాభం చంద్రబాబు అధికారంలోకి రావాలని మాత్రం కోరుకోవడం లేదు. ఆయన వల్ల తమ సామాజికవర్గం బాగుపడదన్నది ముద్రగడ అభిప్రాయం. జగన్ వల్ల సాధ్యమవుతుందా? అంటే దానికి సమాధానం లేదు. అది అంతే. చంద్రబాబుపై ఎప్పుడూ నెగిటివ్ కామెంట్స్ చేస్తూనే ఉంటారు. సో... ఈస్ట్ గోదావరి జిల్లాకు చెందిన ఈ ఇద్దరు నేతలు ఏపీ రాజకీయాల్లో హాట్ టాపిక్ గా మారారు. చెరో వైపు పరోక్షంగా నిలిచారు.

## బాబుకు..మళ్లా మంచి రోజులు

గుంటూరు, నవంబర్ 29, (న్యూస్ పల్స్)చంద్రబాబు స్ట్రాటజీలు అనేక రకాలుగా ఉంటాయి. ఈసారి ఎన్నికల్లో గెలవడం కోసం అన్ని ప్రయత్నాలు ఆయన చేస్తారు. వచ్చే ఎన్నికల్లో ఆయన ప్రధానంగా ప్రచారాన్ని చేయాల్సి ఉంటుంది. మరో రాష్ట్ర స్థాయి నేత లేరు. పొత్తులు కుదిరితే పవన్ కల్యాణ్ మరో ప్రచారకర్తగా మారతారు. అయినా తన పార్టీ పరంగా చూసుకుంటే క్యాంపెయిన్ లో వీక్ అని చంద్రబాబు అంతర్గత సమావేశాల్లో సయితం అంగీకరిస్తారు.. లోకేష్ విషయానికొస్తే ఆయన అటు రాష్ట్ర స్థాయి నేత కాదు. ఇటు నియోజకవర్గం నేత కాదు. ఆయనకు పార్టీ క్యాడర్ తప్ప జనాన్ని ఆకర్షించే సత్తా లేదు. దీంతో వచ్చే ఎన్నికల్లో నారా భువనేశ్వరిని ప్రధాన ప్రచారకర్తగా వినియోగించుకోవాలన్నది చంద్రబాబు ఉద్దేశ్యంగా కన్పిస్తుంది. భువనేశ్వరి మొన్న అసెంబ్లీలో జరిగిన ఘటనలో కావాల్సినంత సానుభూతిని సంపాదించుకున్నారు. ఆమె మహిళల్లో సానుకూలత ఉంది. ఉత్తరాంధ్ర, కోస్తాంధ్ర, రాయలసీమ జిల్లాల్లో ఎన్టీఆర్ కు అభిమానులు ఎక్కువగా ఉన్నారు. ఎన్టీఆర్ కుమార్తెగా భువనేశ్వరి ప్రజల్లోకి వెళితే పార్టీకి మంచి ఊపు వస్తుందని భావిస్తున్నారు. ముఖ్యమైన నియోజకవర్గాల్లో భువనేశ్వరి సభలను, రోడ్ షోలను ప్లాన్ చేసేందుకు చంద్రబాబు ప్రణాళిక రచిస్తున్నారు. భువనేశ్వరి నిన్న రాసిన లేఖతో కొంత జనంలోకి తొలుత పంపించ గలిగారు. చంద్రబాబు నలభై ఏళ్ల రాజకీయ జీవితంలో ఏ ఎన్నికల్లోనూ భువనేశ్వరి ప్రచారం చేయలేదు. ఎన్టీఆర్ కుమార్తెలను.... ఒక్క కుప్పం నియోజకవర్గంలో మాత్రమే ఆమె ఎన్నికల వేళ పర్యటించేవారు. భువనేశ్వరితో కలసి ఎన్టీఆర్ కుమార్తెలను కూడా ప్రచారంలోకి దించాలన్నది చంద్రబాబు యోచన.

## తెరపైకి మళ్లీ ఎన్టీఆర్ జిల్లా

విజయవాడ, నవంబర్ 29, (న్యూస్ పల్స్)ఏపీలో జగన్ ప్రభుత్వం ఎప్పుడు ఎలాంటి సంచలన నిర్ణయం తీసుకుంటుందో ఎవరి ఊహకు అందడం లేదు. జగన్ అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి అనేక సంచలన నిర్ణయాలు తీసుకున్న విషయం తెలిసిందే. అందులో భాగంగానే మూడు రాజధానుల నిర్ణయం వచ్చింది?అలాగే మండలి రద్దు కూడా వచ్చింది. కానీ ఇటీవల ఈ రెండు నిర్ణయాలపై యూటర్న్ తీసుకుని జగన్ సంచలనమే సృష్టించారు. ఇక తాజాగా జగన్ ప్రభుత్వం మరో సంచలన నిర్ణయం తీసుకునే దిశగా ముందుకెళుతున్నట్లు కనిపిస్తోంది. ఇటీవల సీఎం వైఎస్ జగన్ అధ్యక్షతన జరిగిన ఎంపీల సమావేశంలో ఈ అంశం చర్చకొచ్చింది. ఈ సందర్భంగా కొత్త జిల్లాల ఏర్పాటు, దానికి సంబంధించిన అంశాలపై జగన్ చర్చించినట్లు తెలిసింది. అలాగే కొత్త జిల్లాల ఏర్పాటు ఎంతవరకు వచ్చిందని సీఎం ఆరా తీసినట్లు తెలిసింది. అయితే ఈ కొత్త జిల్లాల టాపిక్ జగన్ ప్రభుత్వం వచ్చినప్పుడే మొదలైంది. . కానీ 2019లో జగన్ సర్కారు ఈ ప్రక్రియను ప్రారంభించించిన తర్వాత కేంద్రం జనాభా గణన కోసం భౌగోళిక ప్రాంతాల విభజనపై నిషేధం విధించింది. జనాభా గణన ప్రక్రియ పూర్తయ్యేవరకు కొత్త జిల్లాల ఏర్పాటు వీలుకాదు?ఈ ప్రక్రియ ఎప్పుడు ప్రారంభమవుతుందో తెలియడం లేదు. కానీ జిల్లాల విభజన విషయంలో జగన్ వెనక్కి తగ్గేలా లేరు. ఇప్పటికే ప్రతి పార్లమెంట్ స్థానాన్ని ఒక జిల్లాగా చేస్తానని చెప్పిన విషయం తెలిసిందే. అంటే 25 జిల్లాలు వస్తాయి. అయితే అదనంగా మరో జిల్లా కూడా యాడ్ అవుతుందని, మొత్తం 26 జిల్లాలు చేస్తారని ఎప్పటినుంచో ప్రచారం జరుగుతుంది. అయితే ఈ క్రమంలోనే జిల్లాల అంశంలో జగన్?పలు హామీలు ఇచ్చారు. గతంలో పాదయాత్ర సమయంలో ఒకో జిల్లాలో ఒకో హామీ ఇచ్చుకుంటూ వచ్చారు. అలాగే కృష్ణా జిల్లాకు ఎన్టీఆర్ జిల్లా అని పేరు పెడతామని హామీ ఇచ్చారు. జిల్లాల విభజన జరిగాక ఈ పేరు పెడతారని ప్రచారం జరిగింది. కృష్ణా జిల్లా రెండుగా విడిపోయాక?ఒక జిల్లాకు ఎన్టీఆర్ జిల్లా అని పేరు పెడతారని చర్చలు వచ్చాయి. మరి జిల్లాల విభజన జరిగాక?ఒకటి ఎన్టీఆర్ జిల్లా అని పేరు పెడతారేమో చూడాలి.

## జూనియర్ అభిమానుల ఉత్సాహం

తిరుపతి, నవంబర్ 29, (న్యూస్ పల్స్)ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో జూనియర్ ఎన్టీఆర్ వ్యవహారం రచ్చ లేపుతోంది. ముఖ్యంగా తెలుగు దేశం పార్టీలో ఈ వ్యవహారం కాకరేపుతోంది. ఈ రచ్చలో నేరుగా జూనియర్ ప్రమేయం లేకపోయినా ఏదో ఒక రకంగా ఆయన వార్తల్లో ఉంటున్నారు. ఇప్పట్లో తాను పొలిటికల్ ఎంట్రీ ఇచ్చేది లేదని కొన్నాళ్ల క్రితం జూనియర్ ఎన్టీఆర్ తేల్చి చెప్పినా ఆయన ఫ్యాన్స్ మాత్రం తగ్గడం లేదు. తెలుగు దేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడు నుంచి ఆ పార్టీ నేతలు ఎవరు నియోజకవర్గాలకు వెళ్లినా జూనియర్ ఎన్టీఆర్ ప్రస్తావన లేకుండా ముగియడం లేదు. తాజాగా, ఏపీ అసెంబ్లీలో నారా భువనేశ్వరిపై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ చంద్రబాబు నాయుడు మీడియా సమావేశంలో వెక్కి వెక్కి ఏడ్చిన విషయం తెలిసిందే. దీంతో చంద్రబాబు కుటుంబానికి భారీగా మద్దతు లభించింది. జూనియర్ ఎన్టీఆర్ సైతం స్పందించారు. అయితే, జూనియర్ స్పందన సరిగా లేదంటూ టీడీపీ ముఖ్యనాయకులే ఆయనను టార్గెట్ చేశారుఅప్పటి నుంచి మళ్లీ ఎన్టీఆర్ పేరు మారుమోగుతోంది. చంద్రబాబు ట్రాప్‌లో జూనియర్ ఎన్టీఆర్ పడ్డారంటూ వైసీపీ నేతలు విమర్శలు చేశారు. ఇటు టీడీపీ నేతలు మాత్రం వైసీపీకి ఎన్టీఆర్ భయపడుతున్నారని సంచలన కామెంట్స్ చేశారు. అత్తకు అన్యాయం జరిగితే ఆయన ప్రవచనాలు చెప్పడం ఏంటని ప్రశ్నించారు. ఈ క్రమంలో, జూనియర్ ఎన్టీఆర్‌కు ఆయన అభిమానులు కొండంత అండగా నిలబడ్డారు. ఏకంగా టీడీపీ అధినేత చంద్రబాబునాయుడునే టార్గెట్ చేశారు. సోషల్ మీడియా వేదికగా టీడీపీకి కౌంటర్లు ఇచ్చారు. అయినా కూడా ఆ వేడి చల్లారలేదు. తాజాగా, కుప్పంలో చంద్రబాబుకు జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు ఊహించని షాకిచ్చారు. కాబోయే సీఎం జూనియర్ ఎన్టీఆర్ అంటూ నినాదాలు చేశారు. ఆయన్ను సీఎంగా చూడడమే తమ లక్ష్యం అంటూ ఎన్టీఆర్ ఫ్లెక్సీలు.. జెండాలు పట్టుకొని డ్యాన్సులు వేశారు.. బాణాసంచా కాల్చి సందడి చేశారు. కుప్పంలో జై లవకుశ స్పెషల్ షో ఏర్పాటు చేసిన అభిమానులు.. ఈ సందర్భంగా కాబోయే సీఎం ఎన్టీఆర్ అంటూ నినాదాలు చేశారు. ప్రస్తుతం ఈ వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. చంద్రబాబు కంచుకోటగా భావించే కుప్పంలోనే ఇలాంటి పరిస్థితి నెలకొడటం తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

## ఘాట్ రోడ్డు..కండిషన్స్ అప్లై

తిరుమల, నవంబర్ 29, (న్యూస్ పల్స్)తిరుపతి భారీ వర్షాలను ప్రజలు ఇంకా మరచిపోనేలేదు.. కానీ.. వారం రోజులు తిరగక ముందే మళ్లీ వర్షాలు మొదలయ్యాయి. వర్ష బీభత్సానికి తిరుమల కొండ గతంలో ఎన్నడూ చూడని నష్టాన్ని చవిచూసింది. భారీ వరదలతో ఘాట్ రోడ్లలో కొండ చరియలు ప్రమాద స్థాయిలో విరిగిపడ్డాయి. మెట్ల మార్గమైతే పూర్తిగా ధ్వంసమైంది. దీంతో టీటీడీ అధికారులు మందే అప్రమత్తమై ఘాట్ రోడ్లలో ప్రయాణాలపై ఆంక్షలు విధించింది. భక్తుల భద్రత దృష్ట్యా టీటీడీ అధికారులు ఘాట్ రోడ్లలో ఆంక్షలు విధించారు. రెండు ఘాట్ రోడ్లలో ద్విచక్రవాహనాలను నిలిపివేసిన టీటీడీ అధికారులు.. భక్తులను అప్రమత్తం చేశారు. రాత్రి 7 గంటల వరకు బైక్స్, 10 గంటల వరకు ఫోర్ వీలర్స్ అనుమతించనున్నట్లు టీటీడీ అధికారులు వెల్లడించారు. రాత్రి 10 గంటలకు ఘాట్ రోడ్డు మూసివేసి తిరిగి రేపు వేకువజామున 2 గంటలకు తెరవనున్నట్లు పేర్కొన్నారు. తిరుమలలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు జలాశయాలన్నీ నిండుకుండలా మారాయి. భారీగా వర్షం పడుతుండటంతో భక్తులు ఇబ్బందులకు గురవుతున్నారు. శ్రీవారి దర్శనానికి వైకుంఠం కాంప్లెక్స్‌కు వెళ్లే భక్తులతో పాటుగా దర్శనం తర్వాత బయటకు వచ్చే భక్తులు వసతి గదులకు చేరుకునేందుకు ఇబ్బందులకు గురవుతున్నారు. వర్షం కారణంగా లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. శ్రీవారి ఆలయ పరిసరాలు, మాఢ వీధులు, లడ్డూ వితరణ కేంద్రం, తిరుమల రహదారులు వర్షపు నీరు భారీగా చేరుకోవడంతో టీటీడీ సిబ్బంది వర్షం నీటిని బయటకు పంపే ప్రయత్నం చేస్తున్నారు

## లోయలోకి ఆర్టీసీ బస్సు

కర్నూలు, నవంబర్ 29, (న్యూస్ పల్స్)ఏపీఎస్‌ఆర్టీసీకి చెందిన పల్లెవెలుగు బస్సు ప్రమాదవశాత్తు లోయలో పడిన ఘటన కర్నూలు జిల్లాలో సోమవారం చోటుచేసుకుంది. ప్రమాద తీవ్రత అధికంగానే ఉన్నా అదృష్టవశాత్తు ప్రాణ నష్టం జరగలేదు. ప్రమాదంలో డ్రైవర్, కండక్టర్ సహా ఏడుగురు గాయపడ్డారు. క్షతగాత్రులను 108 వాహనంలో ఆళ్లగడ్డ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఎగువ అహోబిలం నుంచి దిగువ అహోబిలానికి ఘాట్ రోడ్డులో పల్లెవెలుగు బస్సు వస్తున్న క్రమంలో మలుపు వద్ద అదుపుతప్పి లోయలో పడిపోయింది. ప్రమాద సమయంలో బస్సులో ఐదుగురు ప్రయాణికులు మాత్రమే ఉన్నారు.

# కొండ్రూ బజాయించేస్తారా...

శ్రీకాకుళం, నవంబర్ 29, (న్యూస్ పల్స్)కాకుళం జిల్లాకు చెందిన మాజీ మంత్రి టీడీపీ నేత కోండ్రు మురళి టీడీపీలోనే ఉన్నారా? అంటే ఉన్నారంటే ఉన్నారనుకోవాలి. లేదంటే లేదనుకోవాలి. కోండ్రు మురళి 2019 ఎన్నికలలో రాజాం నుంచి పోటీ చేసి వైసీపీ అభ్యర్థి కంబాల జోగులు చేతిలో ఓడిపోయారు. ఓడిపోయిన దగ్గర నుంచి ఆయన పూర్తిగా పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉన్నారు. జగన్ ప్రకటించిన మూడు రాజధానులకు మద్దతు ప్రకటించిన కోండ్రు మురళి చంద్రబాబు ఆగ్రహానికి గురయ్యారు. టీడీపీ తీవ్ర ఇబ్బందులు పడుతున్న సమయంలోనూ కోండ్రు మురళి యాక్టివ్ గా లేకపోవడం పార్టీలో చర్చనీయాంశమైంది. ఆ మధ్య చంద్రబాబు పార్టీ కార్యాలయాలపై జరిగిన దాడిని నిరసిస్తూ 36 గంటల పాటు దీక్ష చేసినప్పుడు కూడా కోండ్రు మురళి కన్పించలేదు. ఆయనను పార్టీలోకి కళా వెంకట్రావు తీసుకొచ్చారు. ఆయన పరిస్థితే ప్రస్తుతం బాగా లేదు. మరోవైపు టీడీపీ అధినాయకత్వం మాజీ స్పీకర్ ప్రతిభా భారతి కుమార్తె గ్రీష్మకు రాజాం నియోజకవర్గంలో మద్దతుగా నిలుస్తున్నట్లు సమాచారం. రాజాంలో ఇప్పుడు పార్టీ నాయకత్వం గ్రీష్మనే నేతగా చూస్తుందనే అనుమానమూ లేకపోలేదు. రాష్ట్ర పార్టీ అధ్యక్షుడిగా అచ్చెన్నాయుడు ఉన్నప్పటికీ కోండ్రు మురళి ఇప్పటి వరకూ ఆయనను కలిసే ప్రయత్నం చేయలేదు. ఆయనను కలిస్తే రాజాంలో కళా వెంకట్రావు వర్గం దూరమవుతుందని కాబోలు. గ్రీష్మకు లోకేష్ మద్దతు లభిస్తుందని తెలిసి కోండ్రు మురళి సైలెంట్ గా ఉన్నారని చెబుతున్నారు. ఇప్పటికే పదవి లేక, గెలిచి పదేళ్లు కావస్తుంది. వచ్చే ఎన్నికలు ఆయన రాజకీయ భవిష్యత్ ను నిర్దేశించేవని చెప్పాల్సిన పనిలేదు. అందుకే కోండ్రు మురళి టీడీపీని వీడాలని భావిస్తున్నారు. టీడీపీ లో విభేదాలతో పాటు రాజాం నియోజకవర్గంలో టీడీపీ నేతల వల్లనే తాను ఓటమి చెందానని భావించడం వల్ల ఆయన ఆ పార్టీలో ఇమడ లేక పోతున్నారు. వైసీపీ సిట్టింగ్ ఎమ్మెల్యే కంభాల జోగులుపై తీవ్ర వ్యతిరేకత ఉంది. ఆయన ఇప్పటికే మూడు సార్లు విజయం సాధించారు. ఈసారి వైసీపీ అభ్యర్థిని మారుస్తుందని చెబుతున్నారు. అందుకే కోండ్రు మురళి వైసీపీ వైపు వెళ్లాలన్న యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. మరి ఏం జరుగుతుందో చూడాలి.

# నిండుకుండలా చెరువులు

అనంతపురం అనంతపురం జిల్లా వ్యాప్తంగా చెరువులు ప్రాజెక్టులు నిండు కుండలా తలిపిస్తున్నాయి కొన్ని దశాబ్దాల తరువాత మిడ్ పెన్నార్ ప్రాజెక్టు పూర్తి స్థాయి సామర్థ్యంతో నిండటంతో జలకళ సంతరించుకుంది. పెన్నా నదిపై ఈ ప్రాజెక్టు నిర్మాణం చేపట్టినప్పటికీ హెచ్ఎల్సి మొదటి దశ కింద గార్లదిన్నె మండలంలోని పెనకచెర్ల వద్ద 1963లో నిర్మాణం చేపట్టారు. అప్పటి నుంచి ఒక్కసారి మాత్రమే డ్యామ్ పూర్తి స్థాయి సామర్థ్యంతో నిండి పొంగిపొర్లింది. ఆ తరువాత నుంచి ఒక్కసారి కూడా పూర్తి స్థాయి సామర్థ్యంతో నీళ్లు నిండిన దాఖలాల్లేవు. 39 ఏళ్ల తరువాత తొలిసారిగా ఈ సంవత్సరం డ్యామ్ నిండింది. ఈ ప్రాజెక్టు పూర్తి స్థాయి నిలువ సామర్థ్యం 5.20 టిఎంసిలు. ఈ నిర్మాణం పూర్తయిన తరువాత 1981లో పెన్నానదికి వరద పోటెత్తిరావడంతో తొలిసారిగా 1.25 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు నదిలో వదిలారు. 1981 తరువాత అంటే 39 ఏళ్ల తరువాత మరోమారు 2020 లో పూర్తి స్థాయి సామర్థ్యం అంటే 5.20 టిఎంసిల నీరు డ్యామ్ కు చేరింది. తిరిగి ఈ సంవత్సరం కూడా నిండి పరవళ్లు తొక్కుతోంది..వర్షాలు అధికమై నీరు మరింత వచ్చే అవకాశాలు పెరిగితే దిగువకు మరిన్ని గేట్లు ఎత్తి వదిలేందుకు వీలుగానూ అధికారులు అప్రమత్తమై ఉన్నారు. చాలా కాలం తరువాత డ్యామ్ పూర్తి స్థాయి సామర్థ్యంతో నిండి ఉండటంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ఒకవైపు తుఫాను ప్రభావంతో వర్షాలు పడే సూచనలు కూడా ఉండటంతో డ్యామ్ ఎగువ భాగంలో వర్షాలు అధికంగా పడితే దిగువకు నీటిని వదిలేందుకు అవసరమైన చర్యలు చేపట్టారు. ఇప్పటికే మిడ్ పెన్నార్ ఉత్తర, దక్షిణ కాలువలతోపాటు, స్లూయిస్ లోకి 3 గేట్ల ద్వారా నీటిని వదిలారు.. ఈ ప్రాజెక్టు కిందనున్న కాలువల కింద 71 వేల ఎకరాల ఆయకట్టు స్థిరీకరించి ఉంది. మిడ్ పెన్నార్ కు హెచ్ఎల్సి నుంచి వచ్చే ఇన్ఫ్లో ను తగ్గించే ప్రయత్నం చేస్తున్నారు. ఎగువనున్న పిఎబిఆర్కు వదిలారు. పిఎబిఆర్ లోనూ పూర్తి సామర్థ్యం నీరు వచ్చి చేరింది. చాలాకాలం తరువాత ఎంపిఆర్ నిండుకుండలా మారింది. మూడు గేట్లు ఎత్తడంతో మారడంతో సందర్శకుల తాకిడి పెరిగింది..

# శ్రీశైలంలో భక్తుల రద్దీ

కర్నూలు శ్రీశైలం ఆలయంలో కార్తీకమాసం ప్రత్యేక పూజలు జరిగాయి. ఈ నేపథ్యంలో భక్తులు ఆలయానికి పోటెత్తారు. కార్తీకమాసం నాల్గవ సోమవారం కావడంతో శ్రీశైలం ఆలయానికి భక్తుల రద్దీ పెరిగిందిజస్వామివారి దర్శనానికి 5 గంటలు సమయం పట్టింది. భక్తులతో ఆలయ క్యూలైన్లు కిక్కిరిసాయి. శివనామ స్మరణతో శ్రీశైలం మారుమ్రోగింది. గంగాధర మండపం వద్ద మహిళలు భక్తులు కార్తీక దీపాలను వెలిగించి కార్తీక నోములు నోములు నోచుకున్నారు. భక్తిశ్రద్ధలతో శ్రీశైలంలోని పాతాళగంగలో కార్తీక పుణ్య స్నానాలచరించారు.

# విషవాయువు లీక్?.ఇద్దరు మృతి

విశాఖపట్నం జవహర్లాల్ నెహ్రూ ఫార్మాసిటీ లో అర్ధరాత్రి ప్రాంతంలో విధులు నిర్వహిస్తున్నమణికంత,దుర్గాప్రసాద్ లు విషవాయువు పీల్చడంతో మృతిచెందారు. విధి నిర్వహణలో భాగంగా పంపు హౌస్ వాలు ఓపెన్ చేస్తుండగా విశవాయువులు లీక్ అయింది. దాంతో వారిద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. మృతులలో ఒకరు తుని ప్రాంతానికి చెందగా, మరొకరు పాయకరావుపేట సీతారాంపురం ప్రాంతానికి చెందిన వారిగా గుర్తించారు. మృతి చెందిన ఇద్దరి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్ ఆస్పత్రికి తరలించారు. విషయం తెలియగానే కుటుంబ సభ్యులు కన్నీటిపర్యంతమైయారు. పరవాడ పోలీసులు ఘటనకు గల కారణాలు అడిగి తెలుసుకొని కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# ఉరుకుంద లో భారీ సంఖ్యలో భక్తులు

## స్వామివారి ఆలయంలో భక్తుల సందడే సందడి

కౌతాళం ఉరుకుంద లో వెలసిన ప్రముఖ పుణ్య క్షేత్రము శ్రీ శ్రీ నరసింహ స్వామి పుణ్యక్షేత్రం సోమవారం విశేష దినోత్సవం సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. కోరిన వారికి కోరికలు నెరవేర్చే కొలిచే కొంగు బంగారం ఈరన్న స్వామి. భక్తుల పాలిట కోరిన కోర్కెలు తీర్చే కల్ప వృక్షం స్వామి వారి విశేష దినోత్సవన్ని పురస్కరించుకొని ఆలయ అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. స్వామి వారి మూల విరాట్ ను పూలు వెండి ఆభరణాలు తో అలంకరించారు. ఉదయం ఏడు గంటల సుప్రభాత సేవ నుంచి రాత్రి ఏడు గంటల వరకు మంగళ హారతి నిర్యహించరు.

# శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో శాస్త్రోక్తంగా లక్షకుంకుమార్చన

## - వర్చువల్ సేవలో పాల్గొన్న గృహస్తులు



తిరుపతి తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో నవంబరు 30 నుండి డిసెంబరు 8వ తేదీ వరకు ఏకాంతంగా జరుగనున్న వార్షిక కార్తీక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని సోమవారం ఉదయం 8 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు లక్షకుంకుమార్చన సేవ శాస్త్రోక్తంగా జరిగింది. శ్రీ వేంకటేశ్వర భక్తి ఛానల్ ప్రత్యక్ష ప్రసారం చేసిన ఈ సేవలో వర్చువల్ విధానం ద్వారా 413 మంది గృహస్తులు తమ ఇళ్ల నుండే పాల్గొన్నారు. ఆలయంలోని శ్రీకృష్ణ ముఖ మండపంలో శ్రీ పద్మావతి అమ్మవారిని ఆశీనులను చేసి ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు అర్చకులు శాస్త్రోక్తంగా లక్షకుంకుమార్చన సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు లక్ష్మీ అష్టోత్తరం, లక్ష్మీ సహస్రనామాలతో అమ్మవారికి కుంకుమతో అర్చన చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న టిటిడి జెఈవో వీరబ్రహ్మం మీడియాతో మాట్లాడుతూ, బ్రహ్మోత్సవాల ముందురోజు లక్షకుంకుమార్చన సేవ నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. కోవిడ్-19 వ్యాప్తి నేపథ్యంలో బ్రహ్మోత్సవాలను ఏకాంతంగా నిర్వహిస్తామని చెప్పారు. ఈ ఉత్సవాలు దిగ్విజయంగా జరగాలని అమ్మవారిని ప్రార్థించినట్టు తెలిపారు. కాగా, హిందూ సనాతన ధర్మంలో కుంకుమకు విశేష ప్రాధాన్యం ఉంది. వివాహితురాలైన మహిళ నుదుట కుంకుమ ధరించడం వల్ల భర్త దీర్ఘాయుష్షు పొందుతాడని హిందూ ధర్మం చెబుతోంది. లక్ష్మీ, సరస్వతి, పార్వతి అమ్మవార్ల పేర్లతో పిలుస్తున్న శక్తి అమ్మవారికి ప్రతిరూపంగా సింధూరం లేదా కుంకుమకు ప్రాశస్త్యం ఉంది. అమ్మవారి ఆలయాల్లో బ్రహ్మోత్సవాలు లాంటి భారీ ఉత్సవాలను నిర్వహించే ముందు అర్చకులు లక్షకుంకుమార్చన నిర్వహించడం సంప్రదాయం. ఈ విశిష్టమైన సేవ ద్వారా అమ్మవారు ప్రసన్నమై ఉత్సవాలు ఎలాంటి ఆటంకాలు లేకుండా విజయవంతంగా జరిగేలా ఆశీర్వదిస్తారని భక్తుల విశ్వాసం.అంకురార్పణ : మంగళవారం సాయంత్రం 6.30 నుండి రాత్రి 8.30 గంటల నడుమ పుణ్యాహవచనం, రక్షాబంధనం, సేనాధిపతి ఉత్సవం, యాగశాలలో అంకురార్పణ కార్యక్రమాలు చేపడతారు.నవంబరు 30న ధ్వజారోహణం : ఆలయంలో నవంబరు 30న ఉదయం 8 గంటల నుంచి 9 గంటల వరకు ధ్వజస్థంభ తిరుమంజనం, అలంకారం, ఉదయం 9.45 నుండి 10 గంటల నడుమ ధనుర్లగ్నంలో ధ్వజారోహణంతో అమ్మవారి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. రాత్రి 7 నుంచి 8 గంటల వరకు చిన్నశేష వాహనంపై అమ్మవారు భక్తులకు దర్శనమిస్తారు.

# గెజిట్ తర్వాతే నోటిఫికేషన్

విజయవాడ, నవంబర్ 29, (న్యూస్ పల్స్)నవ్యాంధ్ర రాజధానిపై దాఖలైన పిటిషన్లపై ఏపీ హైకోర్టులో ఇవాళ విచారణ జరిగింది. రెండు చట్టాల ఉపసంహరణపై ఇప్పటికే ప్రభుత్వం అఫిడవిట్ దాఖలు చేసినట్లు కోర్టుకు తెలిపింది. త్రిసభ్య ధర్మాసనం దీనిపై సుమారు అరగంటకుపైగా విచారించింది. పిటిషన్ల తరపున న్యాయవాదులు శ్యామ్‌దివాన్, సురేష్ వాదనలు వినిపించారు. ఉపసంహరణ బిల్లుల్లో కూడా ఏపీ ప్రభుత్వం మూడు రాజధానులను తీసుకువస్తామని చెప్పిందన్నారు. ఏపీకి అమరావతి మాత్రమే రాజధాని అని.. మాస్టర్ ప్లాన్ కూడా అదే చెబుతోందని పిటిషనర్ తరపు లాయర్లు కోర్టుకు వినిపించారు. అందువల్ల ఈ పిటిషన్లపై విచారణ కొనసాగించాలేమని లాయర్లు శ్యామ్‌దివాన్, సురేష్ వెల్లడించారు.మరోవైపు.. బిల్లులపై గవర్నర్ గెజిట్ నోటిఫికేషన్ ఇవ్వలేదని.. అందుకే గెజిట్ నోటిఫికేషన్ వచ్చాక విచారణ జరుపుతామని త్రిసభ్య ధర్మాసనం స్పష్టం చేసింది. రాజధాని కేసుల విచారణ కారణంగా చట్టానికి లోబడి అభివృద్ధి చేసుకునేందుకు అడ్డంకిగా ఉన్న మధ్యంతర ఉత్తర్వులను తొలగిస్తున్నట్లు ధర్మాసనం తేల్చిచెప్పింది. మరోవైపు.. ప్రభుత్వ శాఖలు, కార్యాలయాల తరలింపుపై మధ్యంతర ఉత్తర్వులు కొనసాగుతాయని హైకోర్టు స్పష్టం చేసింది. ఈ కేసు విచారణ వచ్చే నెల 27కు ధర్మాసనం వాయిదా వేసింది.

# 4 జిల్లాల్లో... భారీ వర్షాలు

తిరుపతి, నవంబర్ 29, (న్యూస్ పల్స్)బంగాళాఖాతంలో శ్రీలంక తీరప్రాంతం మీద ఉన్న ఉపరితల ఆవర్తన ద్రోణి క్రమేణా బలపడుతోంది. దీని ప్రభావంతో చిత్తూరు, కడప, నెల్లూరు, అనంతపురం జిల్లాల్లో కుండపోత వర్షం కురుస్తోంది. రిజర్వాయర్ల ఎగువ ప్రాంతాల్లో నదులు, వాగులు పొంగుతున్నాయి. సోమశిల జలాశయానికి 96 వేల క్యూసెక్కుల వరద నీరు చేరే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రాజెక్టు ద్వారా 1.16 లక్షల క్యూసెక్యులు పెన్నా నదికి విడుదల చేయడం జరిగింది. మరోవైపు పెన్నా వరద ఉధృతికి నది అంచున ఉండే కట్ట కోతకు గురవుతోంది. రోజంతా నెల్లూరు జిల్లా వ్యాప్తంగా ఎడతెరపి లేకుండా వర్షం కురవడంతో జనజీవనం అస్తవ్యస్తమైంది. శనివారం ఉదయం నుంచి ఆదివారం ఉదయం వరకు జిల్లాలో సరాసరి వర్షపాతం 56.9 మిల్లీమీటర్లగా నమోదైంది. ఆదివారం ఉదయం తర్వాత వర్షం మరింత ఎక్కువైంది. అత్యధికంగా బుచ్చిరెడ్డిపాలెంలో 142.2 మి.మీ, ఆత్మకూరులో 105.8 మి.మీ వర్షం కురిసింది. కొడవలూరులో 97.2, సం గంలో 97, విడవలూరులో 96.6, నెల్లూరులో 94.4, కోవూరులో 93, అల్లూరులో 86.8, నాయుడుపేటలో 80.6, అనంత సాగరంలో 75, ఇందుకూరుపేటలో 73.2, దొరవారిసత్రంలో 67.2, పొదలకూరులో 66.2, పెళ్లకూరులో 62.2, బాలాయ పల్లిలో 60.4 మిల్లీమీటర్ల చొప్పున వర్షపాతం నమోదైంది. అత్యల్పంగా సీతారామపురంలో10.8 మి.మీ వర్షం కురిసింది. భారీవర్షాల కారణంగా పలు మండలాల్లో వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి.

# నెల్లూరులో ఇంట్రెస్టింగ్ సీన్

నెల్లూరు, నవంబర్ 29, (న్యూస్ పల్స్)ల్లూరు జిల్లాలో ఇంట్రెస్టింగ్ సీన్ కనిపించింది. అమరాతినే ఏపీకి ఏకైక రాజధానిగా ప్రకటించాలని డిమాడ్ చేస్తూ.. 'న్యాయస్థానం టు దేవస్థానం' పేరుతో ఆ ప్రాంత రైతులు పాదయాత్ర చేస్తోన్న విషయం తెలిసిందే. ప్రస్తుతం ఈ పాదయాత్ర నెల్లూరు జిల్లాకు చేరుకుంది. టీడీపీ శ్రేణులు అమరావతి రైతులకు బాసటగా నిలుస్తూ వస్తున్నారు. ప్రజంట్ నెల్లూరు రూరల్ కొత్తూరు వద్ద అమరావతి రైతుల శిబిరం ఏర్పాటు చేసుకున్నారు. భారీ వర్షాలు వరదల నేపథ్యంలో ఆదివారం, సోమవారం పాదయాత్రకు విరామం ప్రకటించారు. కాగా వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటిస్తున్న నెల్లూరు రూరల్ వైసీపీ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి.. అటుగా వెళ్తూ అమరావతి రైతుల శిబిరంలోకి వెళ్లారు. వర్షాల వల్ల ఎలాంటి సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని ఎమ్మెల్యే, రైతులకు తన ఫోన్ నంబర్ ఇచ్చారు. తన నియోజకవర్గం దాటే వరకు రైతులకు తప్పకుండా సహకరిస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే ఈ మాట చెప్పగానే అక్కడున్న రైతులంతా చప్పట్లు కొట్టారు. అయితే ఈ సందర్భంగా ఎమ్మెల్యేతో మాట్లాడిన అమరావతి రైతులు..' జై అమరావతి' అనాలని ఆయనను కోరారు. వారి ప్రతిపాదనను ఆయన సున్నితంగా తిరస్కరించారు.స్థానిక ఎమ్మెల్యేగా పర్యటనలో భాగంగా అమరావతి రైతులను చూసి ఆగానని? వర్షాల వల్ల ఎవరికి ఇబ్బంది ఉన్నా ఆదుకోవడం తన బాధ్యత అని కోటంరెడ్డి తెలిపారు. కాగా ఏపీ ప్రభుత్వం ఇటీవల 3 రాజధానుల బిల్లును రద్దు చేసిన విషయం తెలిసిందే. ఈసారి పక్కా ప్రణాళికతో, నిపుణులను సంప్రదించి.. న్యాయపరమైన చిక్కులు లేకుండా మళ్లీ బిల్లు తీసుకువస్తామని సీఎం జగన్ స్పష్టం చేశారు

# బీజేపీలో సీఎం లొల్లి..?



హైదరాబాద్, నవంబర్ 29, (న్యూస్ పల్స్)తెలంగాణ బీజేపీకి సీఎం అభ్యర్థి ఎవరు? నెక్స్ట్ ఎన్నికల్లో ఎవరిని బేస్ చేసుకుని బీజేపీ ఎన్నికల బరిలో దిగుతుంది? అంటే ఇప్పుడే ఈ విషయంపై క్లారిటీ వచ్చేలా లేదు. ఎన్నికల ముందు బీజేపీ సీఎం అభ్యర్థిని డిసైడ్ చేసుకుని ఎన్నికలకు వెళ్ళడం కష్టమని తెలుస్తోంది. అయితే సీఎం అభ్యర్థిని డిసైడ్ చేయకపోవడం వల్ల బీజేపీకి కాస్త నష్టం జరిగే అవకాశాలు కూడా ఉన్నాయి.ఎందుకంటే ఇతర రాష్ట్రాల్లో ఎన్నిక వేరు?తెలంగాణలో ఎన్నిక వేరు. ఇక్కడ బీజేపీ ఒక ప్రాంతీయ పార్టీతో తలపడుతుంది. కేసీఆర్ నాయకత్వంలోని టీఆర్ఎస్‌తో బీజేపీ పోటీ పడాలి. కేసీఆర్ ఎంత బలమైన నాయకుడో చెప్పాల్సిన పని లేదు. ఆయనకు చెక్ పెట్టాలంటే బీజేపీలో అంతే బలమైన నాయకుడు ఉండాలి. పార్టీ పరంగా ముందుకెళితే?కేసీఆర్‌ని ఢీకొట్టడం కష్టం. జాతీయ స్థాయిలో మోడీ నాయకత్వాన్ని ముందు పెట్టుకుని బీజేపీ ఎలా ఎన్నికలకు వెళుతుందో అలాగే తెలంగాణలో కూడా ఒక నాయకుడుని ముందుపెట్టుకుని ఎన్నికలకు వెళితే మంచి ఫలితం వస్తుంది. లేకపోతే బీజేపీ బోల్తా కొడుతుంది.అయితే రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్?ఎవరు సీఎం అయినా అలా చేస్తాం..ఇలా చేస్తామని చెబుతున్నారు. మొదటి సంతకం ఉచిత విద్య, వైద్యం ఫైలు మీద పెట్టిస్తామని అంటున్నారు. ఆ బాధ్యత తనదే అంటున్నారు. ఈ విషయంలో బండి కాస్త క్లారిటీ ఇస్తున్నట్లే కనిపిస్తోంది. ఆయన మాటల బట్టి చూస్తే బండి కూడా సీఎం రేసులో ఉన్నారని తెలుస్తోంది.అయితే సీఎం అభ్యర్థి అనే అంశం ఎన్నికలకు ముందే ఫిక్స్ అయిపోతే బాగుంటుంది. అలా కాకుండా సీఎం అభ్యర్థి లేకుండా ఎన్నికల బరిలో దిగితే ఇబ్బంది అవుతుంది. ఇప్పటికే సీఎం అభ్యర్థి రేసులో కిషన్ రెడ్డి, ఈటల రాజేందర్ లాంటి వారు కూడా ఉన్న విషయం తెలిసిందే. మరి సీఎం ఎవరు అనే విషయం త్వరగా క్లారిటీ ఇస్తే బీజేపీకే బెనిఫిట్.హుజూరాబాద్‌లో విజయం తర్వాత ఈటల రాజేందర్ దూకుడు పెంచారు. అధికార పార్టీపై పదునైన విమర్శలు సంధిస్తున్నారు. రాష్ట్ర రాజకీయాల్లో తనదైన మార్క్ వేసే ప్రయత్నం చేస్తున్నారు. ఇదే ఇప్పుడు బీజేపీలో హాట్ టాపిక్‌గా మారింది. పార్టీ నిర్ణయాలను కాదని ఈటల రాజేందర్ సొంత ఎజెండాతో ముందుకు సాగుతున్నారనే ప్రచారం జరుగుతోంది. స్థానిక ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేయవద్దని బీజేపీ రాష్ట్ర కార్యవర్గం తీర్మానించినా ఈటల తన అనుచరులను రంగంలో దించడం చర్చకు దారి తీసింది.

# పునరావాస కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్

చిత్తూరు నవంబర్ 29వరద పరిస్థితి ఇంకా తగ్గుముఖం పట్టలేదు, ఇంకా కొన్ని రోజుల పాటు పునరావాస కేంద్రాల లోనే ఉండాలని, ఇళ్ల వద్ద రక్షణ చర్యలు చేపట్టడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ఎం. హరినారాయణన్ అన్నారు. జిల్లా కలెక్టర్ సోమవారం ఉదయం చిత్తూరు జైహింద్ స్కూల్ లో నిర్వహిస్తున్న పునరావాస కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బాధితులు ఈరోజు ఉదయం తీసుకున్న ఆహార వివరాలను గురించి ప్రశ్నించారు. తమకు ఆహారం గురించి ఇబ్బంది లేదని, మంచి ఆహారాన్ని నాణ్యతగల ది అందిస్తున్నారని, అదేవిధంగా ఇక్కడ ఏర్పాట్లు, వైద్య శిబిరం ఉంటున్నాయని తెలిపారు. మంచినీటి పరిస్థితి టాయిలెట్ల గురించి ప్రశ్నించారు. కొంత మంది బాధితులు తమ ఇళ్ల వద్ద దొంగతనాలు జరుగుతున్నాయని ఆ ప్రాంతంలో కొంత గస్తీ ని ఏర్పాటు చేయాలని కోరారు. వెంటనే అందుకు సంబంధించి కలెక్టర్ ఎస్పీ తో మాట్లాడి పట్టణంలోని బాధితులు ఇల్లు ఉన్న తేనె బండ, వీరభద్ర కాలనీ, కైలాసపురం ప్రాంతాలలో గస్తీ ఏర్పాట్లు చేయాలన్నారు. అదేవిధంగా పారిశుద్ధ్య పనులు సక్రమంగా నిర్వహించాలని, బాధితులకు అన్ని ఏర్పాట్లు చేయాలని నగరపాలక సంస్థకు వారిని ఆదేశించారు. పునరావాస కేంద్రంలో ఉన్న పలువురు మహిళలు బాధితులు ఏర్పాట్ల గురించి సంతృప్తిని వ్యక్తం చేశారు.

# అనుమానాస్పదస్థితిలో యువకుడు మృతి

ఒంగోలు ప్రకాశం జిల్లా దర్శి లోని ముస్లిం బజారుకు చెందిన బొమ్మన బోయిన ఖాసిం (30) అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. మృతుని బాబాయ్ పెద్దకాశీం తెలిపిన వివరాల ప్రకారం మృతుని తమ్ముడి పెళ్లి సందర్భంగా ఇంటి వద్ద ఏర్పాటు చేసిన ఫంక్షన్లో ఓ మహిళ చేయి తగలగా, ఆ మహిళ భర్త కోపోద్రిక్తుడై కాశిం ను గుండెలపై బలంగా కొట్టడంతో అక్కడికక్కడే చనిపోయాడు అని తెలిపారు. స్థానిక ఎస్ఐ చంద్రశేఖర్ యాదవ్ తెలియజేసిన వివరాల ప్రకారం మృతుని తమ్ముని పెళ్లి సందర్భంగా ఏర్పాటుచేసిన జెండాల ఊరేగింపు లో షేక్ సైదాబీ అనే మహిళ కాలు తగలగానే ఆమె భర్త కాషింను విచక్షణారహితంగా కొట్టినట్లు,ఆ దెబ్బలకు తాళలేక స్పృహ కోల్పోగా హాస్పిటల్ కు తరలించారని,అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు తెలిపారని అన్నారు. మృతుని బంధువులు ఫిర్యాదు చేయగా దాడికి పాల్పడిన వారిపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

# గన్నవరం ఆలయంలో చోరీ

విజయవాడ కృష్ణాజిల్లాలో వరుస దొంగతనాలతో దొంగలు తమ చేతివాటాన్ని ప్రదర్శిస్తున్నారు. హనుమాన్ జంక్షన్ , గన్నవరంలో అలయాల్లో నగలు , హుండి ద్విచక్రవాహనాలు చోరీకు పాల్పడుతూ దొంగలు పోలీసులకు సవాల్ విసిరుతున్నారు. తాజాగా ఈరోజు కృష్ణాజిల్లా గన్నవరం భక్తాంజనేయ స్వామి ఆలయంలో భారీ చోరీ జరిగింది. ఆంజనేయ స్వామి విగ్రహంపై ఉన్న ఆభరణాలును సైతం దొంగలించి వెళ్లారు. సమాచారం అందుకున్న గన్నవరం పోలీసులు, సిసిఎస్ , క్లూస్ టీమ్ రంగంలోకి దిగారు. సుమారు 4 కాసులు బంగారం, 13 కేజీల వెండి ని దొంగిలించినట్లు పోలీసులు నిర్ధారించారు. ఈస్ట్ జోన్ ఏసిపి విజయపాల్ , గన్నవరం సిఐ శివాజీ దేవస్థానాన్ని పరిశీలించారు. మరోవైపు, హనుమాన్ జంక్షన్ లో వైకాపా నాయకులు, బాపులపాడు ఉప సర్పంచి దుట్టా శివన్నారాయణ నివాసంలో ఆదివారం అర్ధరాత్రి దోపిడీకు దొంగలు యత్నించారు. దుట్టా శివన్నారాయణ అప్రమత్తం కావడంతో దుండగులు పరారయ్యారు. గత కొన్ని రోజులుగా హనుమాన్ జంక్షన్ ప్రాంతంలో దొంగల సంచారం అధికమైంది. ఆర్టీసీ బస్టాండ్ ఎదురు రోడ్డు బైక్ పై వచ్చి ఒంటరిగా వెళ్తున్న మహిళ మెడలో గొలుసులు తెంచుకుపోయారు . వీరవల్లీ లో రెండు విష్ణు , వినాయక స్వామి , దేవస్థానాల్లో హుండిలు చోరీలకు పాల్పడ్డారు. వీటితో పాటు రోజురోజుకి ద్విచక్రవాహనాలు దొంగతనాలు అధికమైయ్యాయి. గత కొన్ని రోజుల క్రితం జంక్షన్ రాయల్ ఎన్ ఫీల్డ్ బైక్ చోరీ కి గురైంది. ఈ మధ్య కాలంలో హనుమాన్ జంక్షన్ ప్రాంతం ద్విచక్రవాహనాలనే దొంగలు టార్గెట్ చేస్తున్నారు. గత కొన్ని నెలల క్రితం అంకంబాబు రిపోర్టర్ హనుమాన్ జంక్షన్ పోలీసు సబ్ కంట్రోల్ రూమ్ వెనుక సందులో ఉంచిన ద్విచక్రవాహనాన్ని దొంగలించారు. కొన్ని ప్రాంతాల్లో సిసి కెమెరాలు ఉన్నా పనిచేయటం లేదు.

# గూడూరు జలమయం

నెల్లూరు భారీ వర్షాలతో కోల్ కోత్త..చెన్నై నేషనల్ హైవే పై ట్రాఫిక్ కు అంతరాయం కలిగింది. గూడురు వద్ద నేషనల్ హైవే పై వరద నీటి ప్రవాహం వాహనాలకు అడ్డంకిగా మారింది. దాంతో విజయవాడ, చెన్నై, తిరుపతి ల మధ్య రాకపోకలకు ఇబ్బందులెదురయ్యాయి. గూడూరు నేషనల్ హైవే పై వేలాది వాహనాలు నిలిచిపోయాయి. నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా నిర్లక్ష్యం పై వాహనదారులు మండిపడ్డారు. ఎగువ ప్రాంతం నుంచి వస్తున్న వరదనీటితో గూడూరు పట్టణంలోని ఇందిరానగర్ పోలయ్య గుంట ,బీసీ కాలనీ ,చవటపాలెం ,వేముల పాలెం ,శ్రామిక్ నగర్,రజక కాలనీ ప్రాంతాల్లో భారీగా వర్షపు నీరు చేరడంతో స్థానికులు ఇబ్బందులకు గురయ్యారు ఎగువ ప్రాంతం నుంచి మరింత ఎక్కువగా నీటి ప్రవాహం పెరిగితే పూర్తిగా నివాసాలు మునిగిపోయే ప్రమాదం ఉంది స్థానికులు మాట్లాడుతూ ఇందిరానగర్ పోలయ్య గంట ప్రాంతం పూర్తిగా జలదిగ్బంధంలో చిక్కుకుంది అని అధికారులు నీటిని పంపింగ్ చేసే ఏర్పాటు చేయాలని నష్టపరిహారం అందించాలని కోరారు

# ఫాగ్ యంత్రాన్ని ప్రారంభించిన మంత్రి వనిత

కొవ్వూరు సమాజానికి మనకు తోచిన మేరకు చేయూత నివ్వడం ద్వారా మరికొందరికి స్ఫూర్తిగా నిలవాలని రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి తానేటి వనిత పేర్కొన్నారు.సోమవారం స్థానిక మునిసిపల్ కార్యాలయంలో వర్షిణి ట్రస్ట్ బహుకరించిన ఫాగ్ యంత్రాన్ని మంత్రి మునిసిపల్ చైర్ పర్సన్ బావన రత్నకుమారి తో కలసి ప్రారంభించారు. ఈ సందర్భం గా మంత్రి తానేటి వనిత మా ట్లాడుతూ, మాజీ శాసనమం డలి సభ్యులు కోడూరి శివరామకృష్ణ గారి కుమారుడు శ్రీనివాస్ కొవ్వూరు మునిసిపాలిటీ కి ఉచితంగా ఫాగ్ మిషన్ ను అందచేయ్యడం జరిగిందన్నారు. ప్రభుత్వం, అధికారులే అన్ని పనులు చెయ్యాలనే ఆలోచన అన్ని సమయాల్లో కుదరని, మనకు అవకాశం ఉన్నంత మేరకు సమాజ సేవ కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. కోడూరి శ్రీనివాస్ ను ఈ సందర్భంగా అభినందిస్తున్నానని మంత్రి తెలిపారు. జగనన్న స్వచ్ఛ సంకల్పం దిశగా అడుగులు వేస్తున్నామన్నారు. మురుగునీటి వలన దోమలు చేరే అవకాశాలున్నాయని, ప్రజలందరూ స్వచ్ఛ కొవ్వూరు దిశలో భాగస్వామ్యం కావాలని మంత్రి కోరారు. శ్రీనివాస్ వంటి వ్యక్తులు నేటి సమాజానికి అవసరం ఎంతైనా ఉందని, వీరిని చూసి మరో నలుగురు స్ఫూర్తి పొందుతారనడంలో సందేహం లేదన్నారు.

# ఏఐఎస్ఎఫ్ 48వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

ఎమ్మిగనూరు నవంబర్ 29,( విభారె) డిసెంబర్ 3,4,5 తేదీలలో కర్నూల్ నగరంలో జరిగే ఏఐఎస్ఎఫ్ 48వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఏమ్మిగనూరుపట్టణంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ముందు నందు మహాసభలకుసంబంధించిన గోడపత్రికలను విడుదల చేయడం జరిగింది. ఈ సందర్భంగ ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి విజేంద్ర , ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యవర్గ సభ్యులు సుధాకర, తాలూకా అధ్యక్షుడు మునిస్వామి మాట్లాడుతూ రాష్ట్ర మహాసభలకు జిల్లాలోని ఏఐఎస్ఎఫ్ నాయకులు కార్యకర్తలు హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు,రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు దాటినప్పటికీ విద్యకు పెద్దపీట వేస్తామని గొప్పలు పలుకుతూ షో చేస్తున్నారు తప్ప క్షేత్రస్థాయిలో అభివృద్ధి మాత్రం శూన్యమన్నారు.నూతన విద్యా విధానాన్ని ప్రవేశ పెట్టడం వలన విద్యను మరింత అభివృద్ధి చేయొచ్చని రాష్ట్ర ప్రభుత్వం కల్లబొల్లి మాటలు చెబుతున్నారు తప్ప వాటి వలన గ్రామీణ స్థాయిలో పేద,మధ్య తరగతి విద్యార్థులకు ప్రభుత్వ విద్యను దూరం చేసేటటువంటి కుట్రని పేర్కొన్నారు.నూతన విద్యా విధానాన్ని అమలు చేయడం వలన రాష్ట్రంలో దాదాపు 30 వేలకు పైబడిన ప్రభుత్వ పాఠశాలలో మూతపడే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రభుత్వ విద్యను బలోపేతం చేస్తామనే ముసుగులో కార్పొరేట్,ప్రైవేట్ విద్యా సంస్థలకు రాష్ట్ర ప్రభుత్వం కొమ్ము కాస్తుందని తెలియజేశారు. ప్రభుత్వ పాఠశాలలు మూసివేసే కుట్రలో భాగంగానే ఇటీవలే రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జాబ్ క్యాలెండర్ నోటిఫికేషన్ లో ఒక డి ఎస్ సి ఉద్యోగం కూడా లేకపోవడమే దానికి నిదర్శనం అన్నారు. ఎయిడెడ్ పాఠశాలలు ప్రైవేటు పరం చేయాలని ప్రభుత్వ కుట్రలో భాగంగా జీవో నెంబర్ ర్ ర్ 35,42, 50,51 లను రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేంద్రంలో అధికారంలో ఉన్న నరేంద్రమోడీ బిజెపి ప్రభుత్వం రెండోసారి అధికారం చేపట్టినప్పటికీ ప్రభుత్వ విద్యను ఒకవైపు విచ్ఛిన్నం చేస్తూనే, మరోవైపు ఎన్నికల ముందు యువతకు సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని గద్దెనెక్కిన అనంతరం దాని ఊసే ఎత్తకపోవడం చాలా బాధాకరమన్నారు. ఇటువంటి అనేక అంశాలపైన కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విద్యావ్యతిరేక విధానాలపై, యువతను నమ్మించి మోసం చేసినటువంటి విధానాలపైన సుదీర్ఘంగా చర్చించి భవిష్యత్తు కార్యచరణను ప్రకటించేందుకు రాష్ట్రస్థాయిలో విద్యార్థులు, యువతతో మహాసభలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ తాలూకా సహాయ కార్యదర్శి మల్లికార్జున్, దస్తగిరి, నాగరాజు, రవి, మల్లి, వీరేంద్ర, రంగస్వామి, సురేశ్, రమేష్, ఉరుకుంద,తదితరులు పాల్గొన్నారు

# రైల్వేస్టేషన్ పరిసరాలను శుభ్రపరచిన గ్రామ ప్రజలు

తుగ్గలి నవంబర్ 29,( విభారె)తుగ్గలి మండల పరిధిలోని గల లింగనేని దొడ్డి రైల్వే స్టేషన్ నందు రైల్వే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆదివారం స్టేషన్ ప్లాట్ఫారం పై అపరిశుభ్రంగా ఉన్న చెత్తాచెదారం,కంప చెట్లను తొలగించి రైల్వే స్టేషన్ ను ప్రజలు శుభ్రపరిచారు.అలాగే రంగురంగుల పేపర్లతో రైల్వే స్టేషన్ అలంకరించడం జరిగిందని వారు తెలియజేశారు.చుట్టుపక్కల ఉన్న లింగనేనిదొడ్డి,బొందిమడుగుల,బొంతి రాళ్ల, గ్రామాల సర్పంచులు చౌడప్ప,రవి మోహన్, వారితో పాటు చుట్టుపక్కల ఉన్న గ్రామాల ప్రజలు ఇందులో పాల్గొన్నట్లు సర్పంచ్ చౌడప్ప తెలియజేశారు. లింగనేనిదొడ్డి స్టేషన్ నందు త్వరలో ప్యాసింజర్ రైళ్ళు నిలుస్తాయని వీటివల్ల చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు అత్యవసర సమస్యలతో పాటు ఎన్నో ఉపయోగకరమైన సమస్యలు తీరుతాయని బొందిమడుగుల సర్పంచ్ చౌడప్ప,బొంతి రాళ్ల సర్పంచ్ రవి మోహన్ అన్నారు.చుట్టుపక్క గ్రామాల ప్రజల సమస్యలను రైల్వే ఉన్నత అధికారులు తెలుసుకుని ప్రజాప్రతినిధుల మాటకు విలువ ఇచ్చి లింగనేని దొడ్డి రైల్వే స్టేషన్ లో త్వరలో రైలు నిలుపుతామని రైల్వే ఉన్నతాధికారులు స్పందించినందుకు మేము, మా గ్రామ ప్రజలు వారికి కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ నరసింహులు,జిన్నా మాబు,ప్రతాప్ యాదవ్, కె.పి రమేష్,రాముడు,దేవేంద్ర,బాలుగౌడ్, మోహన్,రాజు,లవన్న,దుబ్బ కాశీం,నాగేష్, రజినీకాంత్, బ్రహ్మయ్య, జనార్ధన, సూరన్న, రాంబాబు, కృష్ణమూర్తి, అంజనప్ప శెట్టి, రంగనాయకులు, చిన్న పులికొండ, తిమ్మప్ప, అల్లిపీర, ఎర్రప్ప గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# మహిళా ఉపాధి కోసం ఆహారం ఉత్పత్తులపై శిక్షణ

నంద్యాల నవంబర్ 29,( విభారె)జీవనోపాధిని స్వయంసమృద్ధిని అభివృద్ధి చేయుట బహుళ ఆహార ఉత్పత్తులు తయారుచేయు విధానం పై సొసైటీ ఫర్ రూరల్ అండ్ ఈకో డెవలప్మెంట్ (శ్రీడ్ ) కర్నూలు వారి ఆధ్వర్యంలో నాబార్డ్ ఆంధ్రప్రదేశ్ ప్రాంతీయ కార్యాలయం హైదరాబాద్ వారి ఆర్థిక సహకారంతో మహిళా ఉపాధి కోసం ఉపాధి అవకాశాల కల్పనలో భాగంగా 15 రోజులు సమతుల్య ఆహారం ఉత్పత్తుల పై శిక్షణ కార్యక్రమం నంద్యాల పట్టణంలో నందు నిర్వహించబడును. ఆసక్తి ఉన్న మహిళలు వారి పేర్లను నమోదు చేయించుకొనవలెను శిక్షణ కాలము నందు ప్రతి మహిళకు రోజు యాభై రూపాయల ప్రకారము పరిమిత వేతనం ఇవ్వబడును. అదేవిధంగా శిక్షణానంతరం సర్టిఫికెట్ కూడా ఇవ్వబడును. అదేవిధంగా శిక్షణానంతరం బ్యాంకు ద్వారా రుణ సౌకర్యం కూడా కల్పించబడును శిక్షణ పొందిన మహిళలు పొదుపు లక్ష్మి గ్రూప్ లో సభ్యులుగా కనీసం మూడు సంవత్సరాలు ఉండవలెను ఆధార్ కార్డు మరియు పాన్ కార్డు కలిగి ఉండాలి. బ్యాంకులో రుణం సక్రమంగా చెల్లించుచుండ వలెనుఇలాంటి శిక్షణ తీసుకోనని వారు అర్హులు అలాగే వయసు 50 సంవత్సరములలోపు కలిగిన వారు మాత్రమే అర్హులు ఆసక్తి కలిగిన మహిళలు ఈ క్రింది వారిని సంప్రదించి మీ పేర్లను నమోదు చేసుకున్న వలెను వై.చంద్ర శేఖర్ రెడ్డి 9573177418, ఎం.లక్ష్మి నారాయణ 8500060789 వారిని సంప్రదించి మీ పేరు నమోదు చేసుకొన వలెను ఓ ప్రకటనలో తెలిపారు.

# సర్వం గుంతల మయం

**రోడ్లు పూర్తిగా దెబ్బతినడంతో భారీగా పెరుగుతున్న యాక్సిడెంట్లు**

**దెబ్బతిన్న రోడ్లపై ఏపీ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో అధికారులకు వినతి పత్రం**

**ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కొత్తూరు చిన్న అంజి**

తుగ్గలి నవంబర్ 29,( విభారె)తుగ్గలి మండల పరిధిలోని పగిడిరాయి నుండి జొన్నగిరి కు వెళ్లే రహదారి పూర్తిగా దెబ్బతిన్నదని, రోడ్డు పూర్తిగా దెబ్బతినడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కొత్తూరు చిన్న అంజి తెలియజేశారు.తుగ్గలి మండల వ్యాప్తంగా రహదారులన్నీ పూర్తిగా గుంతలమయంగా మారిపోయాయని, అధికారులు ఎవరు పట్టించుకోవడం లేదని ఆయన తెలియజేశారు.ఎన్నో సంవత్సరాలుగా అధికారులకు తెలియజేస్తున్నా జొన్నగిరి- పగిడిరాయి రహదారిని పట్టించుకోవడంలేదని, వర్షాలకు గుంతల్లో నీరు నిల్వ చేరి యాక్సిడెంట్లు అవుతున్నాయని ఆయన తెలియజేశారు.ఈ గుంతల రోడ్లలో వాహనదారులు ప్రయాణం చేయలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని,కావున త్వరలో ఏపీ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో అధికారులకు వినతి పత్రాన్ని అందజేస్తున్న ట్లు ఆయన తెలియజేశారు.ఇప్పటికైనా అధికారులు వెంటనే స్పందించి ఈ రహదారి సమస్యలను పరిష్కరించాలని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కొత్తూరు చిన్న అంజి తెలియజేశారు.

# మరియమ్మ లాకప్ డెత్

హైదరాబాద్, నవంబర్ 29, (న్యూస్ పల్స్)తెలుగు రాష్ట్రాల్లో తీవ్ర సంచలనం సృష్టించిన మరియమ్మ లాకప్ డెత్ కేసులో తెలంగాణ హైకోర్టు సోమవారం కీలక తీర్పు వెల్లడించింది. ఈ కేసును సీబీఐకి అప్పగించేందుకు నిరాకరించిన ఉన్నత న్యాయస్థానం.. దర్యాప్తు కోసం ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఓ మహిళను అంత దారుణంగా కొడతారా అని మండిపడిన హైకోర్టు.. బాధ్యులైన పోలీసులపై ఏం చర్యలు తీసుకున్నారని నిలదీసింది. కోర్టు ఇప్పటికే ఇచ్చిన రిపోర్టు ఆధారంగా ప్రత్యేక బృందం దర్యాప్తు కొనసాగించాలని ఆదేశించింది.యాదాద్రి భువనగిరి జిల్లాలో జూన్ నెలలో జరిగిన మరియమ్మ లాకప్‌డెత్ కేసులో తెలుగు రాష్ట్రాల్లో తీవ్ర కలకలం రేపింది. దొంగతనం కేసు కింద ఆమెను స్టేషన్‌కు తీసుకొచ్చిన అడ్డగుడూరు పోలీసులు ఇంటరాగేషన్ కింద ఆమెపై థర్డ్ డిగ్రీ ప్రయోగించారు. పోలీసుల దెబ్బలకు తాళలేక మరియమ్మ స్పృహ కోల్పోవడంతో ఆమెను స్థానిక ఆర్ఎంపీ డాక్టర్ వద్దకు తీసుకెళ్లారు. పల్స్ పడిపోవడంతో ఆమె పరిస్థితి విషమంగా ఉందని వెంటనే పెద్దాసుపత్రికి తీసుకెళ్లాలని ఆర్ఎంపీ డాక్టర్ సూచించాడు. దీంతో పోలీసులు హుటాహుటిన ఆమెను భువనగిరి జిల్లా ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే చనిపోయినట్లు అక్కడి డాక్టర్లు నిర్ధారించారు.ఈ ఘటనపై ప్రతిపక్షాలు, అనేక ప్రజా సంఘాలు ఆందోళనలు చేపట్టాయి. క్రమంగా ఇది ఉద్యమంలా మారడంతో తెలంగాణ ప్రభుత్వంపై ఒత్తిడి పెరిగింది. దీంతో స్పందించిన ప్రభుత్వం మరియమ్మ కుటుంబానికి న్యాయం చేస్తామని హామీ ఇచ్చింది. ఈ క్రమంలోనే మరియమ్మ లాకప్ డెత్ కేసుకు సంబంధించి ముగ్గురు పోలీసు అధికారులను విధుల నుంచి తొలగించింది. ఎస్ఐ మహేశ్వర్, కానిస్టేబుల్స్ రషీద్, జానయ్యలను శాశ్వతంగా విధుల నుండి బహిష్కరిస్తూ ఆదేశాలు జారీచేసింది. అంతటితో ఆగకుండా ఆ ముగ్గురిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేసినట్లు గతంలోనే ప్రభుత్వం కోర్టుకు తెలిపింది.అయితే ఈ కేసును సీబీఐ విచారణకు అప్పగించాలన్న డిమాండ్ పెరిగింది. ఈ క్రమంలోనే సీబీఐ విచారణకు ఆదేశిస్తే ప్రజలకు పోలీసులపై నమ్మకం సన్నగిల్లే అవకాశం ఉందని అడ్వకేట్ జనరల్ కోర్టుకు విన్నవించారు. రాష్ట్రంలో ఉన్న దర్యాప్తు సంస్థలతోనే విచారణ జరిపించేలా ఆదేశాలివ్వాలని కోరారు. దీనిపై వాదనలు విన్న హైకోర్టు ఈ కేసును సీబీఐకి అప్పగించాల్సిన అవసరం లేదని పేర్కొంటూ సోమవారం కీలక తీర్పు వెలువరించింది.

# అనుమతుల్లేని ప్రైవేటు పాఠశాల బస్సుల పై చర్యలు తీసుకోవాలి

ఎమ్మిగనూరు పట్టణంలో కండిషన్ లో లేని బస్సుల పై చర్యలు తీసుకోవాలని పట్టణ ట్రాఫిక్ ఎస్ఐ గారికి వినతి పత్రం అందజేశారు అనంతరం పాత్రికేయులతో మాట్లాడుతూఎమ్మిగనూరు పట్టణంలోని ప్రవేట్,కార్పోరేట్ పాఠశాలలు అనుమతులు లేకుండానే ప్రైవేటు బస్సులను వినియోగిస్తున్న ప్రభుత్వ అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు పాఠశాలకు తొత్తులు గా మారారు అని కండిషన్ లేని బస్సుల వల్ల విద్యార్థులకు ప్రమాదాలు జరిగితే విద్యార్థి సంఘాలు గా ఊరుకోబోమని హెచ్చరించారు తక్షణమే ఫిట్నెస్ లేకుండా నడపబడుతున్న భాష్యం,రవీంద్ర భారతి, శ్రీ చైతన్య ,కస్తూరి పాఠశాలల బస్సుల పై లైసెన్స్ లేని డ్రైవర్లతో బస్సులు నడుపుతూ విద్యార్థుల భవిష్యత్తును ప్రశ్నార్థకంగా మారుస్తున్నా ఇలాంటి పాఠశాలల పై తక్షణమే ఎంక్వయిరీ నిర్వహించి బస్సులను సీజ్ చేయవలసిందిగా స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జిల్లా అధ్యక్షులు ఉదయ్ బిసి ఎస్టి మైనారిటీ జిల్లా అధ్యక్షులు సురేష్ కుమార్ లు డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో నాయకులు సందీప్ ఆర్యన్ చందు తదితరులు పాల్గొన్నారు.

# ‘ఆచార్య’ అంచనాలు పెంచేసిన సిద్ధా




మెగాస్టార్ చిరంజీవి.. కొరటాల శివల కాంబోలో రూపొందిన ఆచార్య సినిమా కోసం మెగా అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఈ సినిమాలో చరణ్ కీలక పాత్రలో కనిపించబోతున్నాడు అనే విషయం తెల్సిందే. మొదట సిద్దా పాత్రను గెస్ట్ రోల్ అన్నట్లుగా రాసుకున్న దర్శకుడు కొరటాల శివ పాత్ర నచ్చి చరణ్ చేసేందుకు ఓకే చెప్పడంతో పాత్రను పెంచడం జరిగింది. దాంతో ఆచార్య కాస్త ఫ్యామిలీ మల్టీ స్టారర్ గా మారి పోయింది. గత ఏడాది ఆగస్టు లో వస్తుందని ఆశ పడ్డ ఆచార్య కరోనా వల్ల వాయిదాల మీద వాయిదాలు పడి ఎట్టకేలకు వచ్చే ఏడాది ఫిబ్రవరిలో విడుదల చేయబోతున్నట్లుగా అధికారికంగా ప్రకటే వచ్చింది. సినిమా విడుదల తేదీ దగ్గర పడుతున్న సమయంలో పబ్లిసిటీ షురూ చేసే ఉద్దేశ్యంతో సిద్దా టీజర్ ను రివీల్ చేశారు.ఇప్పటికే ఆచార్య లో సిద్దా గా చరణ్ ఎలి కనిపించబోతున్నాడు.. ఆయన పాత్ర ఏంటీ అనేది ఒక క్లారిటీ ఇచ్చారు. ఇప్పుడు మరింత క్లారిటీ వచ్చేలా టీజర్ ను విడుదల చేశారు. ధర్మస్థలి కి చెందిన వ్యక్తిగా సిద్దా కనిపించబోతున్నట్లుగా తెలుస్తోంది. ధర్మస్థలిని కాపాడుకునే వ్యక్తిగా రామ్ చరణ్ సిద్ద పాత్రలో కనిపించబోతున్నాడని టీజర్ చూస్తుంటే క్లీయర్ గా అర్థం అవుతోంది. వింటేజ్ బ్యాక్ డ్రాప్ తో పాటు ఆకట్టుకునే ఒక మంచి స్క్రీన్ ప్లే తో ఈ సినిమా రూపొందినట్లుగా మేకర్స్ చెబుతున్నారు. రామ్ చరణ్ విజువల్స్ చాలా అద్భుతంగా ఉన్నాయంటూ అభిమానులు కామెంట్స్ చేస్తున్నారు. ఆర్ ఆర్ ఆర్ సినిమా లో అల్లూరి పాత్రకు ఏమాత్రం తగ్గకుండా సిద్ద పాత్ర విజువల్స్ ఉన్నాయంటూ సోషల్ మీడియాలో అభిమానులు చర్చించుకుంటున్నారు.ఆచార్య సినిమా లో చిరంజీవి తో పాటు ఏమాత్రం తగ్గకుండా చరణ్ పాత్ర కూడా ఉండబోతుంది. సోనూసూద్ తో చేసిన ఒక ఫైట్ లో రామ్ చరణ్ నటన ప్రతి ఒక్కరు కూడా ఎంజాయ్ చేస్తారని యూనిట్ సభ్యులు చెబుతున్నారు. వారు చెప్పినట్లుగానే టీజర్ లో సోనూసూద్ ను తిప్పి కొట్టే షాట్ అద్బుతంగా ఉందంటూ అభిమానులు కామెంట్స్ చేస్తున్నారు. మొత్తానికి ఆచార్య సినిమా స్థాయిని సిద్ది అమాంతం పెంచేసి ఫిబ్రవరి 4 ఎప్పుడు వస్తుందా అంటూ ఆసక్తిగా ఎదురు చూసేలా చేసింది. నిమిసం ఉన్న టీజర్ లో రామ్ చరణ్ లోని ఎన్నో యాంగిల్స్ ను చూపించారు. హీరోయిన్ పూజా హెగ్డేతో రొమాన్స్.. సోనూసూద్ తో ఫైటింగ్.. పిల్లలతో ఆటలు ఎన్నో చూపించారు. చివరి షాట్ ఇక అభిమానులకు పూనకాలు తెప్పించాయి. చిరుతపులి మరియు చిరుత పిల్ల వాగుకు అటు వైపు ఉండగా మరో వైపు చరణ్ మరియు చిరంజీవి ని చూపించిన షాట్ అదిరి పోయింది. అభిమానులు ఏదైతే కోరుకుంటున్నారో అదే దొరకబోతుంది అంటూ ఈ టీజర్ ను చూస్తుంటే అర్థం అవుతోంది.

# 'కేజీఎఫ్ 2' మళ్లీ వాయిదా.. కారణాలు రెండు

కన్నడ రాక్ స్టార్ యశ్ హీరోగా ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో రూపొంది ప్రేక్షకుల ముందుకు వచ్చిన కేజీఎఫ్ చిత్రం ఎంతటి ఘన విజయంను దక్కించుకుందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. పాన్ ఇండియా రేంజ్ లో కేజీఎఫ్ సినిమా భారీ వసూళ్లను దక్కించుకుని సాలిడ్ విజయాన్ని సొంతం చేసుకుంది. కేజీఎఫ్ కు సీక్వెల్ గా రూపొందిన కేజీఎఫ్ 2 విడుదల తేదీ విషయంలో ఇప్పటికే పలు సార్లు మార్పు వచ్చింది. కరోనా కారణంగా అదుగో ఇదుగో అంటూ సినిమాను




ఇన్నాళ్లు వాయిదా వేస్తూ వచ్చారు. ఎట్టకేలకు 2022 ఏప్రిల్ 14న విడుదల కాబోతున్నట్లుగా మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. విడుదల తేదీకి ఇంకా నాలుగు నెలలకు ఎక్కువే ఉంది. కనుక ఏ ప్యాచ్ వర్క్ ఉన్నా కూడా ఈ లోపు పూర్తి అవ్వడం ఖాయం అంటూ అంతా నమ్మకంగా ఉన్నారు.వచ్చే ఏడాది సమ్మర్ లో మళ్లీ కేజీఎఫ్ దేశ వ్యాప్తంగా సంచలనంగా నిలువబోతుందని అంటున్నారు. కేజీఎఫ్ 1 సాధించిన వసూళ్లతో పోల్చితే రెండు లేదా మూడు రెట్లు అధిక వసూళ్లను కేజీఎఫ్ 2 దక్కించుకుంటుందనే నమ్మకంను ట్రేడ్ వర్గాల వారు వ్యక్తం చేస్తున్నారు .అంతటి అంచనాలున్న కేజీఎఫ్ 2 ను మళ్లీ వాయిదా వేయబోతున్నట్లుగా వార్తలు వస్తున్నాయి. భారీ అంచనాలున్న కేజీఎఫ్ 2 సినిమా చిత్రీకరణ పూర్తి అయ్యి చాలా నెలలు అవుతుంది. మళ్లీ ఎందుకు విడుదల వాయిదా అంటూ కొందరు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. అయితే కన్నడ ఇండస్ట్రీ వర్గాల్లో మాత్రం కేజీఎఫ్ 2 కు సంబంధించి కొన్ని కీలక సన్నివేశాలను ముఖ్యంగా యాక్షన్ సన్నివేశాలను రీ షూట్ చేయాలనుకుంటున్నారట.రీ షూట్ తో పాటు వీఎఫ్ఎక్స్ వర్క్ కు సంబంధించి కూడా కొన్ని సన్నివేశాల్లో మార్పులు చేర్పులు ఉంటాయని అంటున్నారు. అందుకు కూడా ఆరు నెలల సమయం వరకు పడుతుందని అంటున్నారు. కనుక సినిమా విడుదల వచ్చే సమ్మర్ లో ఉండదని కన్నడ మీడియా వర్గాల వారితో చిత్ర యూనిట్ సభ్యులు అన్నట్లుగా తెలుస్తోంది. కేజీఎఫ్ 2 సినిమా చిత్రీకరణ మళ్లీ మొదలు పెడితే పూర్తి అయ్యేది ఎప్పుడో అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. షూటింగ్ కాస్త ఎక్కువ చేయాల్సి వస్తే ఖచ్చితంగా సినిమా విడుదల వచ్చే ఏడాది చివరి వరకు ఉండక పోవచ్చు అనే టాక్ వినిపిస్తుంది. రీ షూట్ ఒక కారణం కాగా.. విడుదల విషయంలో స్పష్టత ఇవ్వక పోవడంకు కారణం విడుదలకు సరైన సమయం దొరకడం లేదట. పాన్ ఇండియా స్థాయిలో ఈ సినిమా విడుదల చేయాల్సి ఉంది. కనుక ఏ భాషలో కూడా ఆ సమయంలో పెద్ద సినిమాలు లేకుండా చూసుకోవాలి. అది కాస్త ఇబ్బందిగా అవుతున్నట్లుగా తెలుస్తోంది.

# బంగార్రాజు బడ్జెట్ శృతి మించిందట

నాగార్జున హీరోగా వచ్చిన సోగ్గాడే చిన్ని నాయన సినిమాకు ప్రస్తుతం సీక్వెల్ గా బంగార్రాజు తెరకెక్కుతున్న విషయం తెల్సిందే. భారీ అంచనాల నడుమ రూపొందుతున్న ఈ సీక్వెల్ లో నాగ చైతన్య కూడా ఉన్నాడు. నాగార్జున మరియు నాగ చైతన్యలు హీరోలుగా ఉప్పెన హీరోయిన్ కృతి శెట్టి మరియు రమ్యకృష్ణ లు కీలక పాత్రల్లో కనిపించబోతున్నారు. ఇక స్వర్గ లోక సన్నివేశాల్లో ఎంతో మంది ముద్దుగుమ్మలు ఈ సినిమాలో కనిపించబోతున్నారు. పలువు హీరోయిన్స్ మరియు స్టార్ నటీ నటులు బంగార్రాజులో నటిస్తున్న నేపథ్యంలో వారి పారితోషికాలే భారీగా ఉన్నట్లుగా సమాచారం అందుతోంది. నాగార్జున మరియు నాగ చైతన్యల పారితోషికం ఇతర నటీ నటుల మరియు సాంకేతిక నిపుణుల పారితోషికం కలుపుకుని ఈ సినిమా బడ్జెట్ ఏకంగా ఇప్పటికే 45




కోట్ల వరకు అయ్యిందట.అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో ఈ సినిమాను జీ స్టూడియోస్ వారు నిర్మిస్తున్నారు. మొత్తం నిర్మాణ వ్యయం సదరు నిర్మాణ సంస్థ ఖర్చు చేస్తున్నట్లుగా ఇండస్ట్రీ వర్గాల్లో పుకార్లు షికార్లు చేస్తున్నాయి. సినిమా కోసం అన్న పూర్ణ స్టూడియోలో వేసిన సెట్టింగ్ మొదలుకుని అన్ని విషయాల్లో కూడా భారీ తనం కనిపించబోతున్నట్లుగా చెబుతున్నారు. ఇప్పటి వరకు నాగార్జున కాని నాగ చైతన్య కాని ఈ స్థాయి బడ్జెట్ సినిమాల్లో నటించడం జరగలేదు. కాస్త అటు ఇటుగా ఈ సినిమా బడ్జెట్ 50 కోట్లకు పైగా అవుతుందని ఇండస్ట్రీ వర్గాల వారు అంటున్నారు. అక్కినేని హీరోలు ఇద్దరు ఉన్నారు.. అలాగే ఒక సూపర్ హిట్ మూవీకి ఇది సీక్వెల్ కనుక ఖచ్చితంగా బ్రేక్ ఈవెన్ సాధ్యం అంటూ విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఈమధ్య కాలంలో కేవలం వసూళ్ల రూపేనా కాకుండా ఓటీటీ మరియు శాటిలైట్ రైట్స్ కూడా పదుల కోట్లకు అమ్ముడు పోతున్నాయి. కనుక బంగార్రాజుకు 50 కోట్లు పెడితే నష్టం ఉండక పోవచ్చు అంటున్నారు.నాగార్జున మరియు నాగ చైతన్యలు ఈ సినిమా లో తాత మనవడిగా కనిపించబోతున్నట్లుగా తెలుస్తోంది. నాగ చైతన్య యంగ్ బంగార్రాజుగా కనిపించబోతుండగా.. ఉప్పెన బ్యూటీ కృతి శెట్టి ఈ సినిమాలో రాజకీయ నాయకురాలిగా కనిపించబోతుంది. మొత్తానికి ఈ సినిమా ఫ్యామిలీ ఆడియన్స్ తో పాటు ప్రతి ఒక్క యూత్ ఆడియన్స్ కు కూడా కనెక్ట్ అయ్యేలా ఉంటుందని అంటున్నారు. వచ్చే సంక్రాంతికి ఈ సినిమా విడుదల అయ్యే అవకాశం ఉందని అంటున్నారు. కాని సంక్రాంతికి పెద్ద సినిమాలు ఉండటం వల్ల నిజమేనా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఒకటి రెండు వారాల్లో బంగార్రాజు సినిమా విడుదల తేదీపై క్లారిటీ వచ్చే అవకాశం ఉంది అంటున్నారు.

# రాహుల్, రషీద్ ఖాన్‌ను లాక్కొన్నారు.. పంజాబ్, హైదరాబాద్ లబోదిబో!



ఐపీఎల్-2022 మెగా వేలానికి సమయం దగ్గరపడుతున్న కొద్దీ క్రీడాభిమానుల్లో ఉత్కంఠ పెరుగుతోంది. ఏ జట్టు ఎవరిని రీటైన్ చేసుకుంటుంది, వేలంలో ఏ ఆటగాడు ఎంత ధర పలుకుతాడు అన్న అంశాలు ఆసక్తికరంగా మారాయి. ఇదిలా ఉంటే... రీటైన్ చేసుకునే ఆటగాళ్ల జాబితాను సమర్పించే తరుణం ఆసన్నమైన వేళ.. వచ్చే ఏడాది ఎంట్రీ ఇవ్వనున్న లక్నో ఫ్రాంఛైజీపై ఆరోపణలు వెలుగుచూశాయి.కేఎల్ రాహుల్, రషీద్ ఖాన్‌ను ప్రలోభాలకు గురిచేసి తమ జట్లను వీడేలా ఒప్పందాలు జరుగుతున్నాయంటూ పంజాబ్ కింగ్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్ భారత క్రికెట్ నియంత్రణ మండలికి ఫిర్యాదు చేసినట్లు సమాచారం. కాగా పంజాబ్ కింగ్స్ కెప్టెన్, టీమిండియా వైస్ కెప్టెన్ కేఎల్ రాహుల్‌కు ఐపీఎల్‌లో ఉన్న రికార్డుల గురించి ప్రత్యేకంగా ప్రస్తావన అక్కర్లేదు. ఇప్పటి వరకు నాలుగు సార్లు ఆరెంజ్ క్యాప్(అత్యధిక పరుగులు) అందుకున్న ఘనత అతడి సొంతం. అయితే, బ్యాటర్‌గా రాణిస్తున్నా కెప్టెన్‌గా మాత్రం అతడు పెద్దగా ఆకట్టుకోలేకపోతున్నాడు.అయినప్పటికీ రాహుల్ వంటి స్టార్ ప్లేయర్‌ను వదులుకునేందుకు పంజాబ్ సిద్ధంగా లేదు. అయితే, లక్నో మాత్రం పెద్ద మొత్తమైనా చెల్లించి రాహుల్‌ను దక్కించుకునేందుకు ఇప్పటికే బేరసారాలు మొదలుపెట్టిందని ఊహాగానాలు వినిపిస్తున్నాయి. అంతేగాక ఇప్పటికే ఒప్పందం కూడా జరిగిపోయిందనే వదంతులు వ్యాపిస్తున్నాయి. ఇక సన్‌రైజర్స్‌ది కూడా ఇలాంటి పరిస్థితే. అఫ్గనిస్తాన్ స్టార్ బౌలర్ రషీద్ ఖాన్ జట్టును వీడేందుకు సిద్ధంగా ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. అతడిని కూడా సొంతం చేసుకునేందుకు లక్నో ఆసక్తి చూపిస్తోందట.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH.**
**PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**